https://www.sreechakranews.com

# శ్రీచక్ర


SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 60 | కర్నూలు | బుధవారం 08-04-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi



మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



# ఎబిఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

## ఇది ఫ్యాక్షన్ రాజకీయాలకు పరాకాష్ట
## తీవ్రంగా ఖండించిన చంద్రబాబు, లోకేశ్



అమరావతి,ఏప్రిల్7(శ్రీచక్ర) హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు, రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా సీఎం అభివర్ణించారు. సొంతంగా మీడియా సంస్థలను నడుపుతూ.. మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైసీపీ.. తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై ఆరోపణలు, దూషణలు చేయడం అసంబద్ధం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప భయపడలేదని చంద్రబాబు గుర్తుచేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులు, దాడులు, ఒత్తిళ్లకు భయపడ కుండా పత్రికను, ఛానల్‌ను నడుపుతున్నారన్నారు. దాడులు, నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా మహిళల పట్ల, సొంత కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు వ్యవహరించిన తీరును మహిళా సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక.. దాడులు నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. ఈ దాడులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్షన్ బెదిరింపులకు రాధాకృష్ణ భయపడే వ్యక్తి కాదని లోకేశ్ అన్నారు. 'జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ రౌడీ మూకలు ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి ప్రయత్నించడం ఆ పార్టీ విష సంస్కృతిని మరోసారి బయటపెట్టింది. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే దమ్మున్న ఛానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. సాక్షి హైదరాబాద్ ఆఫీస్‌కు ఆంధ్రజ్యోతి ఎంత దూరమో.. ఆంధ్రజ్యోతికి సాక్షి కూడా అంతే దూరంలో ఉంది అన్న సంగతి మర్చిపోవద్దు జగన్. మీడియా కథనాల పట్ల నిరసనలు తెలియజేసే పద్ధతి ఇది కాదు' అని లోకేశ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అయిన మీడియా ప్రశ్నిస్తే జవాబు చెప్పాలి. కథనం ప్రచురిస్తే ఆధారాలతో ఖండించాలి. కథనం ప్రసారం చేస్తే తప్పయితే తప్పని చెప్పగలగాలి. ఇవేవీ మీ దగ్గర లేనప్పుడు ఇలాంటి దుర్మార్గపు దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు..

# రూ.39,436 కోట్లతో విలువైన 31 ప్రాజెక్టులు

## చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ ఆమోదం



అమరావతి,ఏప్రిల్7 (శ్రీచక్ర) సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమను సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సౌరవిద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం సూచించారు.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

## 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
## ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
## ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



న్యూఢిల్లీ,ఏప్రిల్7 (శ్రీచక్ర) : ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు.

# ఆంధ్రజ్యోతి కథనాలు సరికాదు

## నేడు వాటి కార్యాలయాల ముందు నిరసనలు
## ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స



విశాఖపట్నం,ఏప్రిల్7(శ్రీచక్ర) ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ వార్తా వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఎవరైనా విమర్శ చేస్తే విధాన పరంగా ఉండాలన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట ్నంలోని వైసీపీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం, విజ యవాడ, గుంటూరు కలిపి మావిగ ాన్ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారని అన్నారు. రాజధాని పరిధిలో వీటిని తీసుక ురమ్మని తాము ఏం ఉందని చెప్పా రు. తమ నాయకుడు అభిప్రాయాన్ని తాము గౌరవిస ్తున్నామన్నారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని...అక్కడ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. కూటమి కృషితోనే భోగాపురం వచ్చిందని ఒప్పు కొంటున్నానని అన్నారు.

# కల్పక్కంలో ప్రోటోటైప్ పాస్ట్ బ్రీడర్ రియాక్టర్

## అణుశక్తి ప్రయాణంలో కీలక ముందడుగు
## ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు అభినందనలు



అమరావతి,ఏప్రిల్7(శ్రీచక్ర) దేశ అణుశక్తి ప్రయాణంలో కీలక ముందడుగు పడటం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వదేశీ ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీని సాధించిందన్నారు. దేశ అణు కార్యక్రమంలో రెండో దశకు ముఖ్యమైన మైలురాయి సాధించామని తెలిపారు. మోదీ నాయకత్వంలో అణుశక్తి రంగంలో భారత్ దూసుకుపోతుందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందించారు. తమిళనాడులోని కల్పక్కంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైప్ పాస్ట్ బ్రీడర్ రియాక్టర్ సోమవారం క్రిటికాలిటీని విజయవంతంగా సాధించింది. దీంతో దేశ అణు కార్యక్రమంలో రెండో దశలో ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత శాస్త్రీయ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొంటూ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా శ్రీ భీమరాయ స్వామి ప్రభోత్సవం,







పెద్దకడబూరు, ఏప్రిల్, 7 (శ్రీచక్ర): పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవడి గ్రామంలో వెలసిన శ్రీ భీమరాయ స్వామికి గణపతి పూజా, పంచామృత అభిషేకం, ఆకు పూజ, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదమ ులు శ్రీ భీమరాయ స్వామి కి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుండి పారెడ్డి తిమ్మారెడ్డి ఇంటి నుండి శ్రీ భీమరాయ స్వామి గుడి దగ్గరకు కుంభోత్సవాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రబోత్సవాన్ని సాయంత్రం 6: 30 గంటలకు శ్రీ భీమ రాయ స్వామి గుడి దగ్గర నుండి ఆర్ టి సి బస్టాండ్ దగ్గర ఉన్న బసప్ప గుడి దగ్గరకు తీసుకు వెళ్లి అక్కడ బసప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి,పూజల అనంతరం మళ్ళీ తిరిగి అక్కడి నుండి ప్రబోత్సవాన్ని భారీ జన సందోహం మధ్య శ్రీ భీమరాయస్వామి గుడి దగ్గరకు ఊరేగించారు.స్వామివారి ఉత్సవాలలో భాగంగా పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవడి గ్రామంలో శ్రీ భీమరాయ స్వామి ప్రభోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా భారీ భక్తజన సందోహం మధ్య జరిగినదని ఆలయ అర్చకులు టీ.నాగరాజు స్వామి, ఆలయ ధర్మకర్త జి.విరూపాక్ష రెడ్డి "శ్రీ చక్ర" ప్రతినిధితో తెలిపారు. రాత్రి 8 గంటలకు శ్రీ భీమ రాయ స్వామికి మహా మంగళహారతులను సమర్పించారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలోనీ రాత్రి 9 గంటల నుండి బ్రహ్మంగారి నాటక ప్రదర్శన జరుగునని గ్రామ పెద్దలు తెలిపారు. జాలవడి శ్రీ భీమరాయ స్వామి ప్రబోత్సవాన్ని తిలకించడానికి అశేష భక్తజన సందోహం తరలి రావడంతో, చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాంత ప్రజలు భారీగా తరలి రావడంతో గ్రామంలోని వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. గ్రామంలోని భక్తులను ప్రజలను ఆకట్టుకోవడానికి చిన్నచిన్న ఆట బొమ్మలు, రంగరాటాలు, తొట్టెండ్లు, నాటక ప్రదర్శనలు, ఉయ్యాలలు గ్రామంలోని ప్రజలను, భక్తులను, చుట్టూ ప్రక్కల గ్రామీణ ప్రాంత ప్రజలను ఆకట్టుకున్నాయి. గ్రామంలోని జరిగిన ప్రభుత్సవం భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లను ముమ్మరం చేశారు.




# సంపాదకీయం

## పేరు వస్తే కేజ్రీవాల్ చూడలేరా

ఆమ్ ఆద్మీ పార్టీ లో ఎంతో కాలంగా కీలక వ్యూహకర్తగా, అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వ్యవహారం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ నాయకత్వానికి, చద్దాకు మధ్య గత కొన్నాళ్లుగా ముదురుతున్న విభేదాలు ఇప్పుడు బహిర్గతమయ్యాయి. ఆయనను రాజ్యసభలో పార్టీ ఉపనేత పదవి నుంచి తొలగించడమే కాకుండా, సభలో ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వవద్దని పార్టీ ఏకంగా రాజ్యసభ సెక్రటేరియట్‌కు లేఖ రాయడం సంచలనం రేపుతోంది. ఇది ఆయనను ఉద్దేశపూర్వకంగానే పార్టీ దూరం పెడుతోందన్న వాదనలకు బలం చేకూరుస్తోంది. ఇలా ఆయనను పదవి నుంచి దింపేయడానికి, పార్టీ తరపున మాట్లాడకుండా చేయడానికి ఆయన ఆప్ గురించి వ్యతిరేకంగా మాట్లాడలేదు. బీజేపీని పొగడలేదు. చాలా సామాన్యుల అంశాలపై మాట్లాడారు. వాటికి మంచి రియాక్షన్ వచ్చింది. ఆయనకు కేజ్రీవాల్ కన్నా ఎక్కువ పేరు వస్తుందని అనుకున్నారేమో కానీ.. దూరం పెట్టేశారు. రాఘవ్ చద్దా కేవలం సాఫ్ట్ పీఆర్ కే పరిమితం అవుతున్నారని, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యంగా పంజాబ్‌కు సంబంధించిన కీలక సమస్యలను ఆయన సభలో ప్రస్తావించడం లేదని సీఎం భగవంత్ మాన్ వంటి నేతలు విమర్శించారు. దీనిపై చద్దా స్పందిస్తూ.. తాను సభకు వెళ్లేది గందరగోళం సృష్టించడానికి కాదని, ప్రజా సమస్యలపై ప్రభావవంతంగా మాట్లాడటానికని గట్టిగా బదులిచ్చారు.. ముఖ్యంగా వివిధ కంపెనీలు నెల రీఛార్జి పేరుతో 28రోజల కాలపరిమితి నే నెలగా పేర్కొన్నారని రాజ్యసభలో ఎండగట్టారు.వందల కోట్ల రూపాయల రీచార్జ్ కుంభకోణం బయట పెట్టడమే కాక,చట్టసభల ప్రజాప్రతినిధులు నెలకుకేవలం300 రూపాయల రీచార్జ్ నెలకు అపరిమిత వాడకంకుసరిపోతుండగావాళ్ళకు పది వేల రూపాయలు ఫోన్ చార్జీల క్రింద చెల్లించడం ఎందుకు?ఇది ప్రజల సొమ్ము దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు.ఇట్లాంటి సంచలనాత్మక విషయాలను ఆయన రాజ్యనభలో ప్రస్తావించడం ద్వారా దేశంలోని యువతలో విపరీతమైన క్రేజ్ వచ్చింది.మధ్యతరగతివర్గంతమకు ఓప్రాతినిద్యం లభించింది అనిసంబరపడ్డారు.దీనితో చిర్రెత్తు కొచ్చిన కేజ్రీవాల్ ఆయన్ను రాజ్యసభ ఉపనాయకుడుగా తొలగించడంతో పాటు,ఆయనకు ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాయడం రాజ్యసభ చరిత్రలోనే సంచలనం కలిగించింది.రేపు ఆయనను పార్టీ నుండి గెంటి వేయడం కూడా జరుగవచ్చును?ఏదిఎలా ఉన్నా మరోసారి అరవింద్ కేజ్రీవాల్ తన లోపలి మనిషి ని బయట పెట్టుకొని, ప్రశ్నించే స్వభావాన్ని చంపి వేశాడని దేశ యువత భావిస్తుంది.ఇలా ప్రశ్నించే స్వభావాలు గొంతు నులపడం ఒక్క రాఘవచెద్దాతో మొదలు కాలేదు.డిల్లీ ఎన్నికల ముందు మరో రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలైవాల్ ని పార్టీ నుండి సాగనంపారు.అంతకుముందు ఆమ్ఆద్మీ పార్టీ పెట్టిన తొలినాళ్ళలో యోగేంద్ర యాదవ్,కిరణ్ బేడీ లాంటి ప్రశ్నించే మేదావులను పొమ్మనకుండానే పొగ పెట్టారు. ప్రత్యర్థులపై ప్రశ్నలు వర్షం కురిపించే కేజ్రీవాల్ విచిత్రంగా తమపార్టీ నేతలు ప్రశ్నలు,ఎదుగుదలను సహించలేక పోవడం అనేది ఆయనకు ఆకస్మికంగా వచ్చిన మార్పు కాదు.ఆయనలో దీర్ఘకాలికంగా ఉన్న జబ్బునే? అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా వచ్చిన క్రేజ్ ను వాడుకొని అధికారం లోకి వచ్చిన కేజ్రీవాల్ ఆమ్ఆద్మీపార్టీ ని ఓప్రజాస్వామ్య పార్టీగా మలచడం లో విఫలం అయ్యాడు. ఆమ్ఆద్మీపార్టీ కి ఒక రాజకీయ విధానంకానీ , నిర్మాణం కానీ లేదు.వ్యక్తిపూజను అధికారిక ఎజెండాగా చేసిన పార్టీలలో జాబితాలో ఆమ్ఆద్మీపార్టీ ఏనాడో చేరిపోయింది.అంతేకాదు ఆపార్టీకి ఏకైక ఏజెండా కేజ్రీవాల్ తప్ప ఒక నిర్దిష్ట రాజకీయ విధానం కానీ, సిద్ధాంతం కానీ లేదు,కనీస ప్రజాస్వామ్య నిర్మాణం గానీ లేదు.ఆమ్ఆద్మీపార్టీలో సంస్థాగత సమావేశాలు, ఎన్నికలకు ఆవగింజంత చోటు గానీ,కార్యకర్తలు అభిప్రాయాలను గౌరవించడంఅనే అనవాయితీ లేదు. ఒక ఆర్థిక, రాజకీయ ఎజెండా స్పష్టత కూడా ఇంతవరకు లేదు.జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన తర్వాత కూడా ఆమ్ఆద్మీపార్టీ విధానాల్లో మార్పులేదు. ఆప్ జెండా విషయంలో అదే గందరగోళం నెలకొంది. మొదట తెల్లజెండా, తర్వాతపసుపు పచ్చజెండా, తర్వాత పచ్చజెండా క్రింద బులుగు రంగు.ఇక రాజకీయ పరమైన విధానాల్లో కూడా అంతే.ఒకవైపు భగత్ సింగ్, అంబేద్కర్ బొమ్మలు కుడి,ఎడమలో పెట్టు కుంటారు.మరోవైపు వంద రూపాయల నోటు మీద సరస్వతి, లక్ష్మీదేవి, వినాయకుడు బొమ్మలు ముద్రించాలని బిజెపిని డిమాండ్ చేస్తాడు.ప్రాంతీయ పార్టీలకు మద్దతు కూడగట్టి ప్రధాని కావాలనే ఆలోచనతోనే చంద్రబాబు నాయుడు, కేసీఆర్,శివసేన, మమతా బెనర్జీ, తదితరులతో జట్టు కట్టే ప్రయత్నం చేశారు. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ వార్తలు రాష్ట్ర వార్తలు తక్షణ అప్‌డేట్‌లు చివరకు ఇండియా కూటమిలో చేరి పోటీ చేసినా కనీసం తాము అధికారం లో ఉన్న డిల్లీ లో ఒక్క స్థానం గెలవకపోగా పంజాబ్ లోకూడా చావుతప్పి కన్నులొట్టపోయి మూడు స్థానాల్లో మాత్రమే విజయం సాధించాడు.అటుతర్వాత ఆయన సొంత రాష్ట్రం హర్యానా లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉండి స్వతంత్రం గా పోటీ చేయడంవలన కాంగ్రెస్ ఓటమికి నాంది పలికాడు. కేజ్రీవాల్ స్వయం ఒకవైపు బిజెపి కాంగ్రెస్ బిటీం అని,మరోవైపు కాంగ్రెస్, బిజెపి బీటీం అని ప్రచారం చేస్తుంటే,కాదు నాది స్వతంత్ర టీం అని చెప్పుకోలేని రాజకీయ సందిగ్ధ,అసంబద్ధ స్థితిలో ప్రస్తుతం కేజ్రీవాల్ ఉన్నారు.వచ్చిన అధికారం, అవకాశాలు జాతీయ స్థాయిలో నిలుపుకునే నిర్మాణం గానీ, ప్రజాస్వామ్య విధానం కానీ ఆయనలో కనిపించదు.అనుభవం నుండి నేర్చుకున్నది లేదు.

## భూగర్భ జలమట్టం పెంపుకు సమగ్ర చర్యలు తీసుకోండి

*వాగులు, చెరువుల పునరుద్ధరణతో జలసంరక్షణకు ప్రాధాన్యం*
*జలధార-జలహారతి పనులను వేగవంతం చేయండి*
*ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి*
*జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా*






నంద్యాల, ఏప్రిల్ 07 (శ్రీచక్ర ): జిల్లాలో భూగర్భ జలమట్టాన్ని గణనీయంగా పెంచేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో "జలధార – జలహారతి" కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ శాఖ అధికారి రఘురాం, జలవనరుల శాఖ అధికారి శివ శంకర్, డ్వామా పీడీ సూర్యనారాయణ మూర్తి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మేజర్ ఇరిగేషన్ పరిధిలో 215.8 టీఎంసీలు, మీడియం ఇరిగేషన్ కింద 37.59 టీఎంసీలు, మైనర్ ఇరిగేషన్ కింద 330 చెరువుల ద్వారా 5.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నట్లు తెలిపారు. ఈ జలవనరులన్నింటినీ క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, యథావిధిగా పునరుద్ధరించడం ద్వారా భూగర్భ జలాల స్థాయి క్రమంగా పెరుగుతోందని వెల్లడించారు. ట్యాంకులను అనుసంధానం చేయడం ద్వారా జలపాత వ్యవస్థ (కాస్కేడ్) మరింత బలోపేతం అవుతుందని, బేసిన్ కనెక్టివిటీ ద్వారా జలమట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. వాగులకు నీరు సరఫరా చేసే మార్గాల్లో అడ్డంకిగా ఉన్న చెట్లను పూర్తిగా తొలగించాలని, లేకపోతే నీటి నిల్వ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులను శాతం వంద పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే వాగులు, చెరువులపై ఉన్న ఆక్రమణలను వెంటనే గుర్తించి తొలగించేందుకు తహశీల్దార్లు తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ పనుల అమలులో కార్మికులను సమృద్ధిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా చేపల పెంపకాన్ని అభివృద్ధి చేయడంతో పాటు బంజరు భూములను సాగులోకి తీసుకురావచ్చని, పశుగ్రాసం పెంపు మరియు చెరువుల పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు ఇది దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. అదనంగా, విద్యుత్ వినియోగాన్ని తగ్గించే చర్యలపై కూడా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

## ప్రజల విశ్వాసమే నా బలం" 75 వ జన్మదిన వేడుకల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



కేవీబీపురం,ఏప్రిల్ 07(శ్రీచక్ర):సామాన్య ప్రజల మనసులు గెలుచుకోవడం ప్రతి రాజకీయ నాయకుడి లక్ష్యం కావాలి. అయితే ఆ లక్ష్యాన్ని నిజంగా ఆచరణలో పెట్టేవారు చాలా అరుదు. అలాంటి నాయకత్వానికి ఉదాహరణగా నిలుస్తున్నారు కోనేటి అదిమూలం.తన 75వ జన్మదిన వేడుక సందర్భంగా ఆయన వ్యక్తపరచిన అభిప్రాయాలు రాజకీయ నాయకత్వానికి ఒక దిశానిర్దేశం లాంటివి."నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవలోనే ఉంటాను" అనే ఆయన మాటలు కేవలం భావోద్వేగ ప్రకటన కాదు–అది ఒక బాధ్యతతో కూడిన ప్రతిజ్ఞ. ప్రజాసేవను రాజకీయాల్లోకి రావడానికి మార్గంగా కాకుండా, జీవన విధానంగా భావించడం ఆయన నాయకత్వానికి ఉన్న ప్రత్యేకత.ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పడం గమనించదగ్గ విషయం. ప్రస్తుతం రాజకీయాల్లో వ్యక్తిగత ప్రతిష్టలు, ప్రచారాలు ఎక్కువగా కనిపిస్తున్న ఈ కాలంలో, ప్రభుత్వ ప్రతిష్టను ముందుకు తీసుకెళ్లాలని చెప్పడం ఒక బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణం.ప్రజలు మెచ్చే నాయకుడిగా ఉండాలనే ఆశయం కూడా ఆయనలో ఉన్న ప్రజాస్వామ్య భావనను ప్రతిబింబిస్తుంది. ప్రజల అభిమానం పొందడం మాటల్లో కాదు, పనుల్లో ఉండాలి అనే సత్యాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు.ఓటు విలువ తెలిసిన వాడినని, ప్రతి పౌరునికి విలువనిస్తానని ఆయన చెప్పడం ప్రజాస్వామ్యానికి మూలాధారం. ఓటు వేసే ప్రతి వ్యక్తి విలువైనవాడే అనే భావన రాజకీయ నాయకులందరిలో ఉండాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యం.ఇంకా ఒక ముఖ్యమైన అంశం?ప్రభుత్వ నిధులతో చేసిన పనులను తన వ్యక్తిగత కృషిగా ఎప్పుడూ చెప్పుకోలేదని ఆయన పేర్కొనడం. ఇది నేటి రాజకీయాల్లో చాలా అరుదుగా కనిపించే నిజాయితీ. ప్రజా డబ్బుతో చేసిన పనిని ప్రజలకే అంకితం చేయడం ఒక మంచి పాలనకు సూచిక."ప్రజలు ఓట్లు వేస్తేనే పదవులు వస్తాయి? ఎవరో ఇచ్చేవి కావు" అనే వ్యాఖ్య రాజకీయ వ్యవస్థలో ప్రజలే తుది నిర్ణేతలు అన్న నిజాన్ని గుర్తు చేస్తుంది. ఇది నాయకులలో వినయాన్ని పెంచే ఆలోచన.అధికారులు కూడా ప్రజలకు మంచి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించడం పరిపాలనా వ్యవస్థకు ఒక మార్గదర్శకం. ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారానే అధికారులు, నాయకులు ఇద్దరూ మంచి పేరు సంపాదించగలరు.మొత్తం మీద, కోనేటి ఆదిమూలం గారి మాటలు రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, ప్రజాసేవ ఎంత ముఖ్యమో మళ్లీ గుర్తు చేస్తున్నాయి. ఈ భావనలు ఇతర నాయకులకు కూడా మార్గదర్శకంగా మారితే, ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.పి రమేష్, ప్రవీణ్ కుమార్,డీవీఎంసీ మెంబెర్లు అయ్యప్ప,గుత్తి త్యాగరాజు,మాజీ ఎంపీపీ మణి,మాజీ సర్పంచ్ బాలాజీ, విజయ్ కుమార్ నాయుడు,సుదర్శన్ నాయుడు, దశయ్యనాయుడు,భారతి చెంగారెడ్డి దంపతులు,పరంధామ రెడ్డి, శివరామరెడ్డి,నాగరాజురెడ్డి,గుణశేఖర్‌యాదవ్,వెంకటేష్ యాదవ్, ముఖేష్ రెడ్డి,నాగరాజు రెడ్డి,మల్లికార్జునరెడ్డి,వి గోవిందయ్య, శివరామరెడ్డి, చంద్రయ్య నాయుడు,టి నాగరాజు ఇతర మురళి,సెల్వకుమార్,ఇలంగోవన్ రెడ్డి,పద్దురాజు,రమణ, భరణి, చుట్టు పక్కల మండలాలు నుండి ముఖ్యనాయకులు పాల్గొన్నారు.


## ఆర్పి లకు పోషకారము దాని ప్రాముఖ్యత పట్ల అవగాహన కార్యక్రమం




మార్కాపూర్ ఏప్రిల్ 7 (శ్రీ చక్ర)మార్కాపురం స్థానిక మెప్మా కార్యాలయం నందు ఆర్పి లకు పోషకారము దాని ప్రాముఖ్యత పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి పట్టణ స్థాయి సమాఖ్య అధ్యక్షురాలు ది. రమణ గ అధ్యక్షత వహించారు. సి ఎం ఎం ఎలీషా బాబు మరియు క్లస్టర్ ఆర్గనైజర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా టీ రంగారావు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ హాజరై మాట్లాడుతూ సమాఖ్యల సభ్యులకు నాయకత్వం వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అందరూ తమ తమ గ్రూపులలో పోషకాహారము దాని ప్రాముఖ్యత గురించి వివరించాలి అని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం మరియు పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్నటువంటి సన్న బియ్యం లో బలవర్ధకమైనటువంటి పోషక విలువలు కలిగిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నది అని తెలియజేశారు. వీటిలో ఐరన్ విటమిన్ ఏ పోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయని అన్నారు. రోజువారి మనం తీసుకునే ఆహార పదార్థాలలో స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలను తగిన మోతాదులు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు. సూక్ష్మ పోషకాలలో ప్రధానంగా ఉన్నందువలన మార్కెట్లో దొరికే నూనె మరియు సాల్ట్ అలాగే మిల్క్ ఫోర్టిఫైడ్ + ఈ సింబల్ ఉన్న తీసుకొని వాడడం వలన మనలో సూక్ష్మ పోషకాల విలువలు శరీరానికి అందుతాయని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసర పరిశుభ్రతను కలిగి ఉండడం ద్వారా సీజనల్ వ్యాధుల నుండి తప్పించుకోవచ్చు అని తెలియజేశారు. వేసవికాలం కాబట్టి డిహైడ్రేషన్ ప్రాబ్లం నుండి సమస్య నుండి బయటపడడం కోసం తరచుగా నీళ్లు ఎక్కువగా తాగాలని మధ్యాహ్నం 12 గంటల తర్వాత రోడ్లపై తిరగరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి శ్యాంబాబు ప్రోగ్రాం అసోసియేట్స్ విజయవాడ చారిటబుల్ ఫౌండేషన్ మరియు మెప్మా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు

## కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

మార్కాపురం ఏప్రిల్ 7 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత ని మరియు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులను,ఎర్రగొండపాలెం శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో నియోజకవర్గ వైసిపి ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.×ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు మరియు తక్షణమే పరిష్కరించాల్సిన ప్రజా సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు.



## స్వర్ణ అలంకలణలో.. శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనం



మంత్రాలయం, ఏప్రిల్ 7,(శ్రీ చక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాల యంలో స్వర్ణ కవచ అలంకలణలో ఉన్న శ్రీ రాఘ వేంద్ర స్వామి మూల బృందావ నాన్ని భక్తులు దర్శించుకున్నారు. మంగళ వారం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు ఆదేశాను సారం శ్రీ మఠంఅర్చకులు మూ ల బృందావనానికి విశేష పూజ లు నిర్వహిం చారు.వివిధ రాష్ట్రా ల నుంచి వచ్చిన భక్తులు ముం దుగా గ్రామ దేవత శ్రీ మంచా లమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావ నాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు

## జల వనరులపై అవగాహన కార్యక్రమం.., ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్..,



కోట : ఏప్రిల్ 7 (శ్రీ చక్ర):చిట్టేడు గ్రామ పంచాయితీలో సాగు నీటి సంఘాల అధ్యక్షులతో కలిసి జలధారా,జలహారతి కార్యక్రమంలో సాగు నీటి సంఘాల బాధ్యతలు అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం చిట్టేడు గ్రామ పంచాయితీలో ఎంపీడీవో ఎం దిలీప్ కుమార్ నాయక్ అధ్యక్షతన రెవెన్యూ,ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ రాజ్, అగ్రికల్చర్ శాఖల అధికారులు,సాగు నీటి సంఘాల అధ్యక్షులు ఒకేసారి కలిసి గ్రామంలో శిక్షణ చేసి నీటి నిల్వ,చెరువుల్లో నీటి నిల్వ చేసుకునేందుకు చేయవలసిన పనుల గురించి వివరంగా చర్చించారు.ఈ కార్యక్రమం గ్రామ స్థాయిలో నీటి సంరక్షణ,సాగు నీటి నిర్వహణ,చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు చాలా ముఖ్యమని ఎంపిడిఓ దిలీప్ కుమార్ తెలిపారు.నీటిని వృధా చేయకుండా నీటి యొక్క వినియోగాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఎంపీడీవో దిలీప్ కుమార్ ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ అరవింద్ గ్రామస్తులకు తెలియజేశారు.

## బత్తలవల్లం పంచాయతీ లో అంబరాన్నంటిన ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు








వరదయ్యపాలెం ఏప్రిల్(శ్రీ చక్ర) వరదయ్య పాలెం మండలం లోని సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం 75సంవత్సరాల జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు మైక్ నంద, టి వెంకటేష్ టి నీలమ్మ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి ప్రజల నడుమ కేక్ కట్ చేసి పంచి పెట్టారు...

## వృషభ రాజముల బల ప్రదర్శన కార్యక్రమానికి హాజరైన జనసేన నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్

మార్కాపురంఏప్రిల్7(శ్రీ చక్ర)మార్కాపురంజనసేన పార్టీ నియోజక వర్గ కార్యాలయం నందు మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ మాలపాటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగో లు జాతి వృషభరాజాముల బల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ గారిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు నరసింహరావు, జనసేన నాయకులు బెల్లంకొండ గోపి, కంబం వెంకట రమణ, పిన్నెబోయి న శ్రీనివాసులు,దొడ్డరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం కోసం ఏకమవుదాం

## నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఏప్రిల్ 07 (శ్రీచక్ర): నీటి భద్రత ? సాగునీటి సంఘాల బాధ్యత వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమం నిర్వహణ, వీబీ జీ రామ్ జీ పథకం అమలు గురించి ఇరిగేషన్, డ్వామా శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, వీబీ జీ రామ్ జీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి నిల్వలను పెంపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి సమర్థ వినియోగం, కొత్త కుంటలు, చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనులను గుర్తించి త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల గుర్తింపుపై ఇరిగేషన్, డ్వామా అధికారులతో చర్చించారు.వీబీ జీ రామ్ జీ పథకం పకడ్బందీ గా అమలు చేయాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. వేసవిలో కూలీలకు అత్యధికం గా పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ బాల చంద్రారెడ్డి,డ్వామాపిడినరసింహా రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## మనస్సులతోపాటు జీవరాసులు కూడా ఆరోగ్యంగా ఉంటాలి : గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డా. శంకర్ శర్మ



కర్నూలు, ఏప్రిల్ 7 (శ్రీచక్ర): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తన క్లినిక్ లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్. శంకర్ శర్మ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈసంవత్సరం టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ అనే నిదానంతో అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. భూమి మీద ఉన్న అన్ని జీవరాసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పర్యావరణం మంచిగా ఉంటుందన్నారు. కేవలం మనవులు మాత్రమే ఆరోగ్యంగా ఉండి ఇతర జీవరాసులను మరియు చెట్లను సంరక్షించక పోతే పర్యావరణ సమతుల్యం దెబ్బతిని అనేక సమస్యలు వస్తాయని డాక్టర్. శంకర్ శర్మ పేర్కొన్నారు. ఆరోగ్యం ప్రతిఒక్కరికి ప్రాదమిక హక్కు అని అందరూ ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని కోరారు. ప్రతిమనిషి తన ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు వక్కవారి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. మూడ నమ్మకాలను కాకుండా సైన్స్ ను నమ్మి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఆహారంలో మార్పుల వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయని జంక్ ఫుడ్ జోలికి పోకపోడం ఉత్తమం అన్నారు. ఆరోగ్యం విషయంలో ఒకరికిఒకరు సహాయం చేసుకుంటూ ప్రపంచ దేశాలు కలిసి మెలిసి ఉండాలన్నారు. ఆరోగ్య విషయంలో కరోనా ఒక గుణపాఠం అని అలాంటి విపత్తు తిరిగి రాకూడదంటే అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం

### అవగాహన కార్యక్రమంలో 4వ పట్టణ సిఐ విక్రమ సింహా

కర్నూలు, ఏప్రిల్ 07 (శ్రీచక్ర): ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో కర్నూలు ఎపిఎస్ ఆర్టీసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల లో "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు నాలుగో పట్టణ సీఐ విక్రమ్ సింహ హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ల ను విడుదల చేశారు. డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని , సమిష్టి కృషి తో డ్రగ్స్ ను పారద్రోలుదామని ఆర్టీసి డ్రైవర్ల చే ప్రతిజ్ఞ చేయించారు. అనుమానాస్పద పార్సిల్స్ లేదా వ్యక్తులపై వెంటనే 1972కు సమాచారం అందించాలన్నారు. యువతను డ్రగ్స్ నుండి దూరంగా ఉంచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్నూలు, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాలకు చెందిన సుమారు 134 మంది సీనియర్ డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలిషా, ఒఖూఖీఅ ట్రైనింగ్ కాలేజ్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## విజ్ఞానశాస్త్రానికి మద్దతుగా నిలుద్దాం సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్




కర్నూలు, ఏప్రిల్ 07 (శ్రీచక్ర ): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలను విజ్ఞానశాస్త్రానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం కోసం ఏకమవుదాం. విజ్ఞానశాస్త్రానికి మద్దతుగా నిలుద్దాం" అనే ఇతివృత్తంతో, ఈ సంవత్సరం ప్రజలందరు జంతువులు, మొక్కలు మరియు భూగోళం యొక్క ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో శాస్త్రీయ సహకారానికిన్న శక్తిని చాటిచెప్పలాన్నారు. రక్తదానం, అవయవదానం లపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన పెంపొందించి ప్రజలను చైతన్యవంతులను చేయవలెనని కోరారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.మంజుల మాట్లాడుతూ ఆరోగ్యం మనకు అత్యంత ముఖ్యమైన విషయం అని నేడు చాలా మంది ప్రజలు జీవనశైలి, రకరకాల వ్యాధులు మరియు వాతావరణ మార్పులకు సంబంధించిన ఆరోగ్య సమస్యల కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని . ప్రజలు తమ స్వీయ సంరక్షణ పద్ధతులను మరియు ఇతరుల సంరక్షణ పట్ల వారి విధానాలను మూల్యాంకనం చేసుకోవడానికి సహాయపడటానికే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులకు వక్తృత్వ,వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమ అనంతరం విద్యార్థులు మరియు సెట్కూరు సిబ్బంది వారు కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారిణి వైదూర్యం, ఔూ ప్రోగ్రామ్ అధికారిణి శ్రీదేవి, సెట్కూరు సిబ్బంది శ్యామల, నిదీష్, శ్రీనివాస సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మాగారాల్లో భద్రత తప్పనిసరి:జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి





కర్నూలు, ఏప్రిల్ 07 (శ్రీచక్ర ): జిల్లాలో కర్మాగారాల్లో భద్రతకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కర్మాగారాల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఫ్యాక్టరీస్ శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కర్మాగారాల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు కచ్చితంగా భద్రతా చర్యలు తీసుకోవాలని కర్మాగారాల యాజమాన్యాల ప్రతినిధులను ఆదేశించారు. కర్మాగారాల్లో మాక్ డ్రిల్ లు తరచుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.. ఫైర్,పోలీస్, రెవెన్యూ, వైద్య తదితర అత్యవసర విభాగాలు కూడా ఈ మాక్ డ్రిల్ లో పాల్గొనాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన కర్మాగారాల్లో సబ్ కమిటీ లు ఇచ్చిన నివేదికల మేరకు భద్రతా చర్యలను చెక్ చేయాలని కలెక్టర్ డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ను ఆదేశించారు..డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సభ్యులు కూడా టీమ్ గా వెళ్ళి కర్మాగారాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే కర్మాగారాల్లో భద్రతా చర్యలను సేఫ్టీ ఆడిట్ చేయించాలన్నారు. కర్మాగారాల్లో ప్రమాదాలు జరగకుండా ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, ప్రమాదాలు జరిగినపుడు ఎలా స్పందించాలి , టోల్ ఫ్రీ నంబర్ తదితర వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను ఆదేశించారు.ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ నారాయణ రెడ్డి జిల్లాలో ఉన్న కర్మాగారాల పరిస్థితి గురించి వివరించారు. టిజివి ఞఖీంంఅ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఊఖఅఆ సంస్థల ప్రతినిధులు కర్మాగారాల్లో చేపట్టిన భద్రత చర్యల గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డీఎంహెచ్ వో కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కిషోర్ రెడ్డి, ఇతర సభ్యులు, వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ సర్వీసులోని ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుల్స్ కు సబ్ ఇన్ స్పెక్టర్ పదోన్నతికి ఎంపిక పరీక్షలు

### పోలీసు శిక్షణ కేంద్రంలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన కర్నూలు ఎపిఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్





కర్నూలు, ఏప్రిల్ 07 (శ్రీచక్ర): కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో కర్నూలు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న సబ్ ఇన్ స్పెక్టర్ పదోన్నతి ఎంపిక పరీక్షలను కర్నూలు ఎపిఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ మంగళవారం పరిశీలించారు. రాయలసీమ జోన్ పరిధిలోని ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుల్స్ మొత్తం 72 మంది ఈ ఎస్సై పదోన్నతి పరీక్షలకు హాజరైనారు. ఇండోర్ పరీక్షలు పేపర్ 1 - ఎగ్జామ్ లో - ఐ.పి.సి(భారతీయ శిక్షాస్మృతి), నేరప్రక్రియ కోడ్ (సి.ఆర్.పిసి) భారతీయు సాక్ష్యాధారాల చట్టం, ప్రత్యేక స్థానిక చట్టాలు, పేపర్ 2 - ఎగ్జామ్ లో - పోలీసు విధానం, విచారణ న్యాయం, వైద్య విషయాలు, నేర వైజ్ఞానిక శాస్త్రం, వేలు ముద్ర, పాద ముద్రలు, శాస్త్రీయ సహాయం, నేరాలను నిరోధించడం , గుర్తించడం వంటి తదితర విభాగాలపై పరీక్షలు నిర్వహించారు.ఏప్రిల్ 8 వ తేది బుధవారం ఔట్ డోర్ పరీక్షలు నిర్వహిస్తారు. డ్రిల్లు, ఆయుధాల పై పరిజ్ఞానం , నేర స్థల పరిశీలన, మౌఖిక పరీక్ష(ఓరల్ టెస్ట్) తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నిర్వహణకు డిటిసి ప్రిన్సిపల్ హుస్సేన్ పీరా, డిటిసి వైస్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పరీక్షలలో ప్రతిభ కనబరచిన వారికి సబ్ ఇన్ స్పెక్టర్ లుగా పదోన్నతులు కల్పిస్తారు. ఈ పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ / డిటిసి ప్రిన్సిపాల్ హుస్సేన్ పీరా , కర్నూలు డిటిసి డిఎస్పీ / వైస్ ప్రిన్సిపాల్ దుర్గప్రసాద్ , డిఎస్పీ లు శ్రీనివాసులు, బాల స్వామి రెడ్డి , సూర్యనారాయణ రెడ్డి, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందిని, కర్నూలు రేంజ్ డిఐజి మేనేజర్ రత్నప్రకాష్, సిఐలు, ఎస్సైలు , డిఐజి ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.


## మీడియా ప్రతినిధుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం ఆరోగ్యంపై అవగాహన పెంపే లక్ష్యం జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా






నంద్యాల, ఏప్రిల్ 07 (శ్రీచక్ర): జిల్లాలోని మీడియా ప్రతినిధుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. మంగళవారం నంద్యాల పట్టణంలోని గాంధీనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడి ఏర్పాట్లపై డీఎంహెచ్ఓను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా జర్నలిస్టులు ఎప్పటికప్పుడు తీరిక లేని జీవితాన్ని గడుపుతున్నందున, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలోనే మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ఈ ఉచిత ఆరోగ్య తనిఖీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా "ప్రివెంటివ్ హెల్త్ కేర్" (ముందస్తు ఆరోగ్య సంరక్షణ)పై అవగాహన పెంపు చాలా కీలకమని, మీడియా మిత్రులకు సరైన ఆరోగ్య జ్ఞానం ఉంటే అది సమాజంలో విస్తృత స్థాయిలో ప్రజలకు చేరుతుందని అన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ శిబిరంలో రక్తపరీక్షల అనంతరం నిపుణ వైద్యులు జర్నలిస్టులకు ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచిత వైద్య సేవలు అందించడం విశేషం.× హెల్త్ క్యాంపులో నిర్వహించిన పరీక్షలు×రక్తపోటు (ఃఖ), ఈసీజీ (ఇఅఉ), ఎక్స్‌రే, సీబీపీ (అఃఖ), ఎల్ఎఫ్టీ (ఒఈఖ), ఆర్ఎఫ్టీ (ఖీఈఖ), లిపిడ్ ప్రొఫైల్, ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఖీఙ), సీరం ఎలక్ట్రోలైట్స్, హెచ్ఐవి, హెచ్బిఎస్ఏజీ, హెచ్సివి వంటి స్క్రీనింగ్ పరీక్షలు, అలాగే కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డా. లలిత, గైనకాలజిస్టులు డా. అనూష, డా. అయేషా, పీడియాట్రిషన్ డా. అనిత, సైకియాట్రిస్ట్ డా. శరత్ చంద్ర, జనరల్ మెడిసిన్ వైద్యులు డా. ప్రియాంక, డా. శైలజ, కార్డియాలజిస్ట్ డా. క్రాంతి, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు డా. ప్రసన్న లక్ష్మి, డా. శ్రీజ, డా. కాంతారావు నాయక్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు, సమాచార పౌరసంబంధాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కరిమద్దెలలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు



గడివేముల, ఏప్రిల్ 7 (శ్రీచక్ర): గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కె. సిద్ధారెడ్డిచే శ్రీమద్రామాయణంపై ప్రవచనం, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు, శుక్రవారం వరకు ఉపన్యాసాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, శనివారం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మాణమైన శ్రీ మాతా మారెమ్మ దేవస్థానం నందు భజన కార్యక్రమాలతో ఈ కార్యక్రమాలు ముగియనున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త సమాజ సభ్యులు ఎ.నారాయణ రెడ్డి, ఎ. సోమసుందర రెడ్డి, యం. శివారెడ్డి, కె. శివారెడ్డి, బి. రామకృష్ణారెడ్డి, కె. వెంకట రామిరెడ్డి, యం. అయ్యన్న, కె. నారాయణ, ఎస్. శేఖర్ రెడ్డి, జి వెంకటరెడ్డి, కె. తులసిరెడ్డితో పాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.


# అమరావతికి గెజిట్ విడుదలతో కొత్త అధ్యాయం ప్రారంభం

## :దేశానికి దిక్సూచిగా మారనున్న ఏపి రాజధాని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి



మార్కాపురం ఏప్రిల్ 7 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా:×ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయానికి మరింత బలం చేకూరింది. 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) చట్టం–2026'కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలుపగా, కేంద్ర గెజిట్ విడుదల చేయడంతో ఈ చట్టం అధికారికంగా అమలులోకి వచ్చింది. ఈ పరిణామంపై బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాజధాని అంశంపై గతంలో నెలకొన్న అనేక అపోహలు, అనిశ్చితులు ఈ చట్టంతో పూర్తిగా తొలగిపోయాయని డాక్టర్ రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇకపై రాజధాని అభివృద్ధి వేగంగా జరుగుతూ, రాష్ట్రానికి పరిపాలనా స్థిరత్వం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో నూతన విశ్వాసాన్ని నింపడమే కాకుండా, అభివృద్ధి దిశగా అమరావతిని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని అశాభావం వ్యక్తం చేశారు.అలాగే దేశానికి ఏపి రాజధాని అమరావతి దిక్సూచిగా మారనుందని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి అన్నారు.

## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసిన రామచంద్రపురం,కాజులూరు మండలాల వైసిపి అధ్యక్షులు



కాజులూరు, ఎప్రిల్ 7( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డినిమర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా కాజులూరు మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు, కుయ్యేరు గ్రామ మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి , రామచంద్రపురం మండల వైసీపీ అధ్యక్షులు పోల్నాటి వర ప్రసాద్,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వ కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గానికి సంబంధించిన ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కొంతసేపు చర్చించుకొని, పార్టీ బలోపేతం , నియోజకవర్గ స్థితిగతులపై తీసుకోవాల్సిన పలు అంశాలపై ముచ్చటిం చుకున్నారు.

## రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో న్యాయ అవగాహన సదస్సు



రామచంద్రపురం, ఏప్రిల్ 7( శ్రీచక్ర)ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ నందు మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ కే. వెంకటేశ్వర్ రావు ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగాఆరోగ్యమే మహాభాగ్యం అని మంచి ఆరోగ్యం ఉన్నట్లయితే అదే మానవుడికి సంపదని తెలియజేశారు. ప్రస్తుతంవేసవి కాలంలో ప్రజలు ప్రభుత్వాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను తమతమ ఇంటి వద్ద ఉంచుకోవాలని ఈ వేసవి తట్టుకోనేందుకు ఇవి ఉపయోగపడతాయని అలాగే బార్లీ, కొబ్బరి బొండాలు తీసుకోవాలని, మంచినీళ్లు ఎక్కువ తాగాలని వడగాలిపులు నుంచి తమకు తామే రక్షించుకోవాలని అన్నారు . కూలి పనికి వెళ్లే రైతులు ,వ్యవసాయ కూలీలు చెట్లు వద్ద నీడ ప్రదేశాల్లో సేదతీరుతూ ఉండాలని, సమయానికి భోజనం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేనల్ అడ్వకేట్ .బండి శ్రీనివాస్ . దోమలపాటి సత్యనారాయణ . ఏరియా హాస్పిటల్ ఆర్ ఎం ఓ. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గొల్లపల్లి కృష్ణ ,నర్సింగ్ సూపరెండెంట్, ఏరియా హాస్పిటల్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర- ఉల్లాస్ లో 3వేల మందికి వయోజన విద్య

## మండలంలో వయోజనవిద్య టార్గెట్ ను అధిగమించాలి. కాజులూరు ఎంపీడీవో రాంబాబు.



కాజులూరు, ఎప్రిల్ 7 ( శ్రీచక్ర)అక్షరాంధ్ర- ఉల్లాన కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండలంలో మూడువేల మందికి వయోజన విద్య అందించే దిశగా కార్యక్రమం చేపట్టను న్నామని కాజులూరు మండలం ఎంపీడీవో జె. రాంబాబు పేర్కొన్నారువయోజన విద్య విషయంలో మండలానికి ఇచ్చిన టార్గెట్ ను అధికమించాలని రాంబాబు సూచించారు. ఈ మేరకు మంగళవారంకాజులూరు మండల కార్యాలయం నందు ఎంపీడీవో రాంబాబు సమావేశం నిర్వహిం చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజన విద్యను ప్రోత్సహించేనీదుకు ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర ? ఉల్లాస్ 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3వేల మందికి వయోజనులకు విద్య అందజేయాలని ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ కి సంబంధించి 3 వందల మంది వాలంటీర్ టీచర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు, వారి ద్వారా ఒక్కొక్కరు 10 మంది అభ్యాసకులకు విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరం నందు అక్షరాంధ్ర ? ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 170 వాలంటీర్ టీచర్ల ద్వారా 1700 వయోజనులకు విద్య అందించడం జరిగిందని ఈసంధర్భంగా ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి గణాంక సహాయకులు పోలిశెట్టి రాజేష్, మండల విద్యాశాఖాధికారి డేవిడ్ , ఎ.పి.ఒ బి. వెంకటలక్ష్మి , ఎ.పి.యం, టి. రాము తదితరులు హాజరయ్యారు

# చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే మావిగన్ పై ఐవిఆర్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి.

## భూతుల కిట్టు వైయస్సార్ సిపి శ్రేణుల భార్యలపై రోత రాతలు రాస్తే గుణపాఠం తప్పదు. చంద్రబాబు... ఏబీఎన్ రాధాకృష్ణలపై వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం ధ్వజం.

కడప ,అతి తక్కువ ఖర్చుతో, రాజధానిని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు వై.ఎస్ జగన్ వదిలిన రామబాణం... తారక మంత్రం 'మావిగన్'అని అలాంటి గొప్ప ప్లాన్ పై కనీసం రాష్ట్ర ప్రజల, మేధావుల అభిప్రాయాలను తెలుసుకోకుండా వైయస్సార్ సిపి చీఫ్, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పై ట్రోల్స్ చేయడం, నీచ విమర్శలు, రోత రాతలు రాయడం సిగ్గుచేటని... టిడిపి అభ్యర్థుల ఎంపికకు, ప్రజాభిప్రాయ సేకరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవిఆర్) ను ఉపయోగిస్తారని, అదే తరహాలో దమ్ము, ధైర్యం ఉంటే మావిగన్ పై ఐవిఆర్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి సవాల్ విసిరారు. ఖాజీపేట మండలం, దుంపలగట్టు లోని ఆయన స్వగృహంలో మంగళవారం ఉదయం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ... వై.ఎస్ జగన్ మీ భార్యలు మీ భార్యలు కారని చెబితే గుడ్డిగా నమ్మి కట్టుకున్న ఇల్లాలిని వదిలి, చెల్లిగా భావించి, మళ్లీ పెండ్లి సంబంధాలను చూడడానికి వెనుకాడని వెన్నుముక లేని బ్యాచ్ వైయస్సార్ సిపి లో తయారైందని బూతులు కిట్టు (ఏబీఎన్ రాధాకృష్ణ) మాటలు మహిళల ఆత్మగౌరాన్ని దెబ్బతీశాయని, ఇలాంటి నీచ, నికృష్ట భాష వాడిన బూతుల కిట్టుకి వైయస్సార్ సిపి శ్రేణులు, మహిళలు గుణపాఠం చెబుతారని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. చంద్రబాబు,ఎల్లో మీడియా ప్రత్యేక హోదా ఇవ్వలేదని నాడు ప్రధాని నరేంద్ర మోడీని నీచ భాషలతో తిట్టి, 2024 ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్నారని... మరి బిజెపి రాష్ట్రానికి ఏమిచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. టిడిపి శ్రేణులు, ఎల్లో మీడియా నాడు చంద్రబాబు చెబితేనే నరేంద్ర మోడీని నీచంగా తిట్టారని... నేడు మళ్లీ చంద్రబాబు చెబితేనే ఆహా, ఓహో, అద్భుతం, మహాద్భుతం అంటూ చిడతలు వాయిస్తున్నారన్నారు. మరి దీనిపై వారంతపు పలుకుల్లో బూతుల కిట్టు టిడిపి శ్రేణుల్ని, చంద్రబాబును విమర్శించే దమ్ము, ధైర్యం ఉందా? అని ఆయన మరోసారి సవాల్ విసిరారు. లేకుంటే వైయస్సార్సీపి శ్రేణులకు, వై.ఎస్ జగన్ కు ముఖ్యంగా మహిళలకు బూతుల కిట్టు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర ప్రజల దృష్టిలో చరిత్ర హీనునివి కాక తప్పదని ఆయన హెచ్చరించారు. బూతుల కిట్టు జగన్ ను తక్కువగా అంచనా వేస్తున్నారని, భారతదేశంలోని అతి పెద్ద పార్టీ అయినా కాంగ్రెస్ ను,కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీని ఎదిరించి, 16 నెలలు జైలు జీవితం అనుభవించి మళ్లీ తిరిగి లేచిన కెరటంలా ముఖ్యమంత్రి అయిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దీనిని గుర్తించి ఏబీఎన్ రాధాకృష్ణ మసలుకోవాలని ఆయన హితవు పలికారు. జగన్ అధికారంలో ఉన్నా... లేకున్నా జనం ప్రభంజనంలా జగన్ వెంటే నడుస్తున్నారని... జగన్ ఓడినా ఒంటరిగా పోటీ చేసి 40 శాతం ఓట్లను సాధించా రని,అలాంటి జగన్ అధికారంలో లేకున్నా బాహుబలి అని ఆయన విశ్లేషించారు. చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణలు జగన్ పై విషయం చిమ్మి, గ్లోబెల్స్ ప్రచారం చేసి జగన్ ను ఓడించాలనుకోవడం పగటి కలేనని ఫినోలెక్స్ పక్షిలా తిరిగి లేచి జగన్ ముఖ్యమంత్రి కావడం తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత వాస్తవమో అంతే వాస్తవమని రెడ్యం తేల్చి చెప్పారు.

# స్ఫూర్తి వెల్ఫేర్ నందు తన పుట్టినరోజు జరుపుకున్న పోలేపల్లి



మార్కాపురం ఏప్రిల్ 7 (శ్రీచక్ర)మార్కాపురం ఎం ఆర్ హ్యూమన్ రైట్స్ ఏపీ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ పోలేపల్లి వెంకట లక్ష్మీనారాయణ జవహర్ నగర్ కాలనీలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగుల స్కూల్ నందు తన జన్మదిన పురస్కరించుకొని కేక్ కట్ చేసి పిల్లలతో జరుపుకోవడం జరిగింది అనంతరం.పిల్లలకు స్వీట్లు బిస్కెట్లు ఫ్రూట్స్ అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక పరిస్థితి బాగాలేని పిల్లల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం నాకెంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు అనంతరంఎం ఆర్ హ్యూమన్ రైట్స్ జిల్లా ఎన్ చైర్మన్ డాక్టర్ ఎన్ బి వి ఎల్ కిరణ్ కుమార్. విజన్ క్లబ్ సభ్యులు ప్రెసిడెంట్ కాంసెట్టి వెంకట నవీన్ కుమార్ సెక్రెటరీ కొత్త మాస వెంకట మురళీకృష్ణ రవికుమార్ ప్రెసిడెంట్ వెలుగోరి వెంకటేశ్వర్లు మాజీ అధ్యక్షుడు గుర్రం రామారావు మాజీ సెక్రటరీ స్పెషల్ వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొని దుశాల్వాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు

# వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనలో మంత్రి నిమ్మల



మార్కాపురం ఏప్రిల్ 7 (శ్రీ చక్ర)రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించను న్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ గుండా ప్రయాణించి కొల్లం వాగు వద్ద ఉన్న ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ పనుల పురోగతిని ఆయన స్వయంగా పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన 18 కిలోమీటర్ల పొడవైన టన్నెల్లోకి వెళ్లి, అక్కడ జరుగుతున్న బెంచింగ్ మరియు లైనింగ్ పనుల నాణ్యతను, వేగాన్ని మంత్రి పరిశీలించనున్నారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలనే లక్ష్యంతో మంత్రి చేపట్టిన ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ కలిగిరి శాంతి ఇంటిలో ఏసీబీ సోదాలు

విజయవాడ,విజయవాడ, గుంటూరు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. తాడేపల్లిలో నివాసం ఉంటున్న ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ కలిగిరి శాంతి ఇంటిపై ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి తాడేపల్లి లోని ఆమె నివాసానికి చేరుకున్న ఏసీబీ బృందాలు పలు కీలక పత్రాలు, ఆస్తుల వివరాలను నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.ఇంట్లోని డాక్యుమెంట్లు, బ్యాంక్ లాకర్లు, ఆస్తుల వివరాలను అధికారులు సవివరంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే కుటుంబ సభ్యులను కూడా అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

# ట్రెండింగ్ లో మావిగన్...

విజయవాడ, ఏప్రిల్ 7, సోషల్ మీడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చే?యించినట్లు ప్రచారం సాగుతోంది. రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మీట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మీట్‌లో మచిలీపట్నం – విజయవాడ – గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. మచిలీపట్నంలో ఓం, విజయవాడలో ఎవి, గుంటూరులో ఉజఔను తీసుకుని ఓంఎవిఉజఔ అని పేరు పెట్టాలని సూచించారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది.మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది.ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మావిగన్ రాజధాని ప్రతిపాదన కుదిపేస్తోంది. ముఖ్యంగా ఈ ప్రతిపాదన వెనుక సలహాదారులు ఉన్నారు అన్నది అనుమానం. అయితే అది ఎవరన్నది మాత్రం తెలియడం లేదు. కానీ సజ్జల రామకృష్ణారెడ్డి లాంటివారు అది పూర్తిగా జగన్మోహన్ రెడ్డి ఐడియా అని మీడియా ముందుకు వచ్చి చెప్పారు. అయితే సజ్జల ప్రత్యేకంగా చెప్పడం వెనుక వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా తాడేపల్లి కార్యాలయంలో జరిగిన పరిణామాల క్రమంలోనే ఆయన మీడియా ముందుకు వచ్చి మాట్లాడాల్సి వచ్చింది. సజ్జల వర్సెస్ చెవిరెడ్డి యుద్ధం ఈ వ్యవహారంతో పతాక స్థాయికి చేరినట్లు వైసీపీలోనే ప్రచారం నడుస్తోంది. ఈ వింతైన పేరు, ప్రతిపాదన వెనుక చెవిరెడ్డి వ్యూహం ఉందనే ప్రచారం జరగడంతో.. మావిగన్ నెపం తన పైకి రాకుండా సజ్జల రామకృష్ణారెడ్డి జాగ్రత్త పడినట్లు కనిపిస్తున్నారు.ప్రతిపాదన అనేది ఇప్పుడు చేసేది కాదు. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే జగన్మోహన్ రెడ్డి ఈ సూచన చేసి ఉంటే చాలా బాగుండేది. ఒకవైపు అమరావతి నిర్మాణం కొనసాగుతోంది. దానిని నిలిపివేసి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు తెచ్చారు. అమరావతి పనులను అడ్డుకొని దానిని ఒక స్మశానంతో పోల్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులు పునః ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో జగన్ మావిగన్ ప్రతిపాదన ఫెయిల్యూర్ గా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత చూసి వైసిపి లోని ముఖ్య నేతలు అంతా ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. ప్రెస్ మీట్ లు పెట్టి ఈ వింత పేరును సమర్థిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదు అని భయపడ్డారు. అందుకే అంబటి రాంబాబు, కాసు మహేష్ రెడ్డి లాంటి ఒకరిద్దరు మాత్రమే దీనిపై మాట్లాడారు. మరోవైపు సజ్జల చుట్టూ ఆరోపణలు రావడం, ఆయన ఇటువంటి చచ్చు సలహాలు ఇస్తారని సొంతవారే అనుమానించడంతో మీడియా ముందుకు వచ్చారు. మావిగన్ అనేది ఎవరి సలహా కాదు అని.. అది జగన్మోహన్ రెడ్డి స్వయం నిర్ణయం అని సత్తి చెప్పే ప్రయత్నం చేశారు.మరోవైపు ఈ మావిగన్ సలహా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిది అని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. గత కొంతకాలంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ లో కీలకం అవుతూ వస్తున్నారు. . అయితే ఇప్పుడు పార్టీకి డ్యామేజ్ జరుగుతుండడం.. స్వయంగా పార్టీ శ్రేణులే వ్యతిరేకిస్తుండడంతో సజ్జల దానిని రెట్టింపు చేయాలనుకున్నారు. అందుకే ఈ క్రెడిట్ మొత్తం జగన్మోహన్ రెడ్డి ఖాతాలో వేశారు. పరోక్షంగా తన ప్రమేయం లేదని సంకేతాలు ఇచ్చి.. ఇదంతా చేసింది చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని అనుమానం రేగేలా మాట్లాడారు.ఇటీవల సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాధాన్యతను తగ్గించాలని కొన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాడేపల్లిలో టాక్ వినిపిస్తోంది. సజ్జలను పార్టీ నుంచి సాగనంపేందుకు వైసిపి లోని ఒక బలమైన వర్గం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వచ్చే రెండు మూడు నెలల్లో పార్టీలో సంచలనాత్మక మార్పులు ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలను జగన్మోహన్ రెడ్డి దూరం పెడతారని కూడా టాక్ నడుస్తోంది. చుట్టూ కోటరితో పార్టీకి డ్యామేజ్ జరుగుతోందని.. ఇలా అయితే పార్టీలో కొనసాగడం కష్టమని సీనియర్లు కొందరు అల్టిమేట్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి సలహాదారులే పవర్ఫుల్. రాజశేఖర్ రెడ్డి సమకాలీకులు సైతం ఆ జిల్లాల వరకే ఉండేవారు. సలహాదారులు మాత్రం జగన్ తర్వాత అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు ఆ సలహాదారుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇదే అదునుగా సీనియర్లు జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెబుతున్నారు. వారు పార్టీలో ఉంటే కొనసాగలేమని తేల్చి చెప్పినట్లు బయట ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే ఒకటి రెండు నెలల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సంచలనాలు నమోదయ్యే అవకాశం ఉంది.

# గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్

విజయవాడ, ఏప్రిల్ 7,ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాష్ట్రపతి ఆమోదం నేపథ్యంలో కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ -2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024 జూన్ 2 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది.ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతి బిల్లు రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. ఈ బిల్లును పరిశీలించిన అనంతరం.. న్యాయ నిపుణులతో సంప్రదింపుల తర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ 2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం జూన్ 2, 2024 నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొన్నారు.ఏపీ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లును కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా.. ఉభయసభలు ఆమోదం తెలిపాయి. సుమారు ఐదు గంటలు లోక్‌సభ, రాజ్యసభల్లో అమరావతి బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం ఎలాంటి సవరణలు ప్రతిపాదించకుండానే అమరావతికి బిల్లుకు లోక్ సభ, రాజ్యసభలు ఆమోదం తెలిపాయి. దీంతో లోక్‌సభ సచివాలయం అమరావతి బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపించగా.. రాష్ట్రపతి సోమవారం రోజున అమరావతి బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. దీంతో అమరావతి బిల్లు చట్టరూపం దాల్చింది.

# రాజమండ్రిలో భారీ ఈవెంట్

రాజమండ్రి, ఏప్రిల్ 7, ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం ప్రపంచ స్థాయి భారీ ఈవెంట్ కు వెల్కమ్ చెబుతోంది. ఈ బోట్ రేసింగ్ లాంచ్ ఈవెంట్ రాజమండ్రి లో జరుగుతుంది. మే నెలలో మూడు రోజుల పాటు గోదావరి లో ఈ బోట్ రేసింగ్ జరగబోతోంది. డ్రాగన్ బోట్ లీగ్ పేరుతో జరిగే బోట్ రేసింగ్ ఈవెంట్ ఇండియా లో జరగడం ఇదే తొలిసారి. ఏకంగా 25 దేశాల నుండి 1200మందికి పైగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.డ్రాగన్ బోట్ రేసింగ్ అనేది చైనా ప్రాచీన పడవ పోటీల క్రీడ. లయ బద్ధంగా మూగే డప్పు శబ్దాల కనుగుణంగా వేగంగా వెళ్లే పడవ పోటీలు ఇవి. మనదేశం లోనూ కేరళ, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఇలాంటి పోటీలే జరుగుతూ ఉన్నా ఇంత భారీ స్థాయిలో మనదేశం లో జరగడం మాత్రం ఇదే తొలిసారి.రాజమండ్రిని సాంస్కృతికపరంగా ఇప్పటికే ఆంధ్రులు రాజధానిగా భావిస్తారు. దానిని టూరిజం ఈవెంట్ల పరంగా కూడా పూర్తిస్థాయిలో డెవలప్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ లో చాలా ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది జరిగే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని వేగంగా అభివృద్ధి పనులు కూడా చేస్తున్నారు. వాటికి డ్రాగన్ బోట్ రేసింగ్ లాంటి ఈవెంట్లు మరింత సహాయం చేస్తాయని నిర్వాహకులు చెప్పున్నారు.డ్రాగన్ బోట్ రేసింగ్ 2026 " లోగో, షెడ్యూల్, డ్రెస్ కోడ్ రాజమండ్రి ఓ౦ం ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో రిలీజ్ చెయ్యబోతున్నారుఈ ఇంటర్నేషనల్ డ్రాగన్ బోట్ రేసింగ్ -2026) లో 25 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనబోతుండగా ఇప్పటికే 12కు పైగా దేశాలు కన్ఫర్మ్ అయ్యాయి. మెన్, విమెన్, మిక్సడ్ కేటగిరీల్లో ఈ పోటీలు జరుగుతాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు మే 30 నుండి మూడు రోజులపాటు పోటీలు జరుగుతాయని తెలుస్తోంది. పూర్తి వివరాలు మంగళవారం ఉదయం తెలియజేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

# రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత

కర్నూలు, ఏప్రిల్ 7, వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడి బజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య ర్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీ బలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఆధిపత్య పోరు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.



# ఆగమ్యగోచరంగా ఆర్ధిక భవిష్యత్తు


విజయవాడ, ఏప్రిల్ 7, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాగ్ వెల్లడించిన గణాంకాలు కేవలం అంకెలు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు హెచ్చరికలు అని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యత పాటించడంలో విఫలమవడమే కాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం తాత్కాలిక అవసరాల కోసమే ప్రాధాన్యత ఇస్తోందని. తెచ్చిన అప్పుల్లో సింహభాగం అనుత్పాదక వ్యయానికే ఖర్చు చేస్తూ, సంపద సృష్టిని పూర్తిగా గాలికొదిలేయడం రాష్ట్ర ఆర్థిక పునాదులను బలహీనపరుస్తోందని అంటున్నారు. ఏ రాష్ట్రానికైనా ఆర్థిక స్థిరత్వం రావాలంటే తెచ్చిన అప్పులను ఆస్తుల కల్పన కోసం వినియోగించాలి. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు మెరుగుపడితేనే భవిష్యత్తులో కొత్త ఆదాయ వనరులు పుట్టుకొస్తాయి. కానీ ఏపీ ప్రభుత్వం తెచ్చిన అప్పుల్లో కేవలం 24 శాతం మాత్రమే ఇలాంటి అభివృద్ధి పనులకు వెచ్చిస్తోంది. మిగిలిన 75 శాతం పైగా నిధులు కేవలం పాత అప్పుల వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, ఉచిత పథకాలకే సరిపోతున్నాయి. దీనివల్ల రాష్ట్రం అప్పు తెచ్చి పాత అప్పు కట్టే ప్రమాదకరమైన డెట్ ట్రాప్ లో చిక్కుకుంటోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ లోపించడం వల్ల రెవెన్యూ లోటు గణనీయంగా పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య బాధ్యత , బడ్జెట్ నిర్వహణ చట్టం నిర్దేశించిన 2.7 శాతం లక్ష్యాన్ని దాటి రెవెన్యూ లోటు 3.75 శాతానికి చేరుకుంది. ప్రభుత్వం తన సొంత అవసరాల కోసం ఆదాయాన్ని సమకూర్చుకోలేక నిరంతరం రుణాల వైపు మొగ్గు చూపుతోంది. గత రెండేళ్లలోనే సుమారు 3.20 లక్షల కోట్ల రూపాయల కొత్త అప్పులు చేయడం ద్వారా రాష్ట్రం గత ఐదేళ్ల అప్పుల రికార్డులను సమం చేసింది. ఇది ఖజానాపై మోయలేని భారాన్ని పెంచుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తన రోజువారీ ఖర్చుల కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న ఓవర్‌డ్రాఫ్ట్ మరియు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపైనే పూర్తిగా ఆధారపడుతోంది. 2024-25 సంవత్సరంలో కేవలం ఎనిమిది రోజులు తప్ప, మిగిలిన అన్ని రోజులు ప్రభుత్వం అడ్వాన్సుల ద్వారానే నిధులను సేకరించింది. ఏడాది కాలంలో సుమారు 1.72 లక్షల కోట్ల రూపాయలను ఈ రూపంలో తీసుకోవడం ఆర్థిక సంక్షోభ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా తీసుకున్న నిధులకు అదనంగా వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సి రావడం వల్ల రాష్ట్రం అప్పుల చక్రబంధంలో చిక్కుకుంటోంది.సంపద సృష్టి విషయంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం రాబోయే తరాలపై మోయలేని భారాన్ని మోపుతోందని అంటున్నారు. సొంత పన్ను ఆదాయం పెంచుకునే దిశగా పారిశ్రామికీకరణ , వాణిజ్య అభివృద్ధిపై దృష్టి సారించకుండా, కేవలం అప్పుల మీద అప్పులు చేసుకుంటూ పోవడం ఆత్మాహుతి సదృశమే అవుతుంది. ద్రవ్యలోటు కేంద్రం విధించిన 4 శాతం పరిమితిని దాటి 5.1 శాతానికి చేరడం అంటే, రాష్ట్రం తన ఆర్థిక స్వయంప్రతిపత్తిని కోల్పోవడానికి సిద్ధపడటమేనని చెబుతున్నారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ మంత్రాన్నే నమ్ముకోకుండా, సంపద సృష్టించే మార్గాల వైపు అడుగులు వేయాలి. ఆదాయం లేని ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూలుస్తుందని.. అనుత్పాదక వ్యయాన్ని కఠినంగా తగ్గించుకుని, పెట్టుబడి వ్యయాన్ని పెంచినప్పుడే రాష్ట్రం గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

# ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు

కర్నూలు ఏప్రిల్ 7,ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా బెంగళూరు చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ తిరుపతి, నాయుడుపేట మీదుగా వెళ్లేందుకు కేంద్రం ఓకే చెప్పింది. ఈ కనెక్టవిటీతో అమరావతికి రెండో హైస్పీడ్ కారిడార్ లింక్ కానుంది. సీఎం చంద్రబాబు రిక్వెస్ట్ మేరకు కేంద్రం ఈ ఎలైన్‌మెంట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రెండు హైస్పీడ్ రైల్ కారిడార్లకు కనెక్ట్ కానుంది. వాస్తవానికి ఏపీ మీదుగా మూడు కారిడార్లు వెళుతుండగా.. రెండు కారిడార్లు అమరావతితో లింక్ కాబోతున్నాయి. హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను ఇప్పటికే అమరావతితో కనెక్ట్ చేయాలని కేంద్రం నిర్ణయించగా.. తాజాగా మైసూరు-చెన్నై కారిడార్ విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను చిత్తూరు నుంచి తిరుపతి మీదుగా నాయుడుపేటకు లింకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వినతితో ఈ ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.ఇప్పటికే హైదరాబాద్ టు చెన్నై కారిడార్ అమరావతి మీదుగా గుంటూరు, చీరాల, ఒంగోలు, నెల్లూరు, నాయుడుపేట, శ్రీసిటీ మీదుగా చెన్నైకి ఏర్పాటు కానుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం నాయుడుపేట, తిరుపతి, చిత్తూరు, బంగారుపాళ్యం, బెంగళూరు, మాండ్య మీదుగా మైసూరుకు రెండో కారిడార్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రతో పాటుగా తమిళనాడు, కర్ణాటకలకు ఉపయోగపడేలా హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్లాన్ చేసింది. వీటిలో హైదరాబాద్ టు చెన్నై, హైదరాబాద్ టు బెంగళూరు, బెంగళూరు-చెన్నై కారిడార్లు ఉన్నాయి. అయితే ఈ కారిడార్లలో తిరుపతిని చేర్చలేదు.బెంగళూరు-చెన్నై కారిడార్‌ను చిత్తూరు, తిరుపతి మీదుగా నాయుడుపేటకు కనెక్ట్ చేయలని చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదించారు. హైదరాబాద్-చెన్నై కారిడార్ ఎలైన్‌మెంట్‌లో ఇప్పటికే అమరావతిని కనెక్ట్ చేయగా.. తాజా ప్రతిపాదనలతో అమరావతికి, చెన్నై, బెంగళూరుతోపాటు మైసూరుతోనూ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీనికి సంబంధించి, వచ్చే ఏడాది నాటికి డీపీఆర్ రూపొందించాలని భావిస్తున్నారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను రైల్వేశాఖ ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది. హైదరాబాద్-బెంగళూరు మార్గం రాయలసీమ ప్రాంతం మీదుగా వెళుతోంది. మరో హైస్పీడ్ కారిడార్ బెంగళూరు-చెన్నై మధ్య ప్లాన్ చేసింది. అయితే ఈ అంశాలపై క్లారిటీ రావాల్సి ఉంది.హైదరాబాద్-బెంగళూరు కారిడార్ ఏపీలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళుతుంది. చెన్నై-బెంగళూరు మధ్య కారిడార్ ఏపీలోని చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లేలా గతంలో ప్లాన్ చేశారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రిక్వెస్ట్‌తో తిరుపతి, నాయుడపేటను కూడా ఈ అలైన్‌మెం? చేర్చారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా వెళుతుంది.

# రీ ఎంట్రీకి విజయసాయిరెడ్డి...

నెల్లూరు, ఏప్రిల్ 7,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాజధాని ప్రతిపాదన విషయంలో జగన్ చుట్టూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీకి టిడిపి, జనసేన బలమైన ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆ జాబితాలో ఇప్పుడు చాలా పార్టీలు వచ్చి చేరుతున్నాయి. చివరకు ఇప్పటివరకు స్నేహంగా వ్యవహరించిన గులాబీ పార్టీ సైతం రూటు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అమరావతి రాజధాని విషయంలో పక్కన ఉన్న తెలంగాణలో సైతం జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రతికూలత వస్తోంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ జరిగిన సమయంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి మాటలు చూస్తే మాత్రం జగన్ పై వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతుంది.



మరోవైపు అది చాలదన్నట్టు జగన్మోహన్ రెడ్డి మావిగన్ రాజధాని ప్రతిపాదనను సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేవారు సైతం దిక్కుమాలిన సలహా అంటూ విరుచుకుపడుతున్నారు. మావిగన్ ప్రతిపాదన అనేది జగన్మోహన్ రెడ్డి సొంత నిర్ణయం అని సజ్జల లాంటి వారు మీడియా ముందుకు వచ్చి చెప్తున్నారు.అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఫైనల్ అన్నట్టు ఉండేది. జగన్ పై ఈగ వాలితే అంతా పడిపోయేవారు. కానీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చించే క్రమంలో జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నాయి వివిధ పార్టీలు. కానీ కనీసం కౌంటర్ ఇవ్వలేకపోయారు ఆ పార్టీ నేతలు. నిండు రాజ్యసభలో జగన్మోహన్ రెడ్డి పై కాంగ్రెస్ ఎంపీలు విరుచుకుపడితే ఏం చేస్తున్నట్టు అని ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఇదేనా మీ సమర్థత అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ఇక్కడ విజయసాయిరెడ్డి రెండు రకాల లక్ష్యాలను నెరవేర్చుకున్నారు. ఒకటి తనలాంటి వాడు జగన్ వెంట లేకపోవడం లోటు అని సంకేతాలు పంపాడు. కేంద్ర రాజకీయాల్లో వైసీపీకి అత్యవసరంగా ఒక నేత అవసరం అని గుర్తు చేశారు.మరోవైపు కూటమికి వ్యతిరేకంగా ట్వీట్ చేశారు విజయసాయిరెడ్డి. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పించడం ఎంత ముఖ్యమో.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం అని హెచ్చరిస్తూ స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. కొత్త రాజధాని ప్రతిపాదన కంటే రైతుల సమస్యలపై వైసీపీ పోరాడితే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. అయితే ఇప్పటికీ తాను కూటమికి వ్యతిరేకమని.. అవసరం అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమని సంకేతాలు పంపగలరు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన ఆయన తరువాతే ఎందుకో రాజకీయాలు మాట్లాడుతూ వచ్చారు. రాజకీయాలు చేయాలని ఉందని చెప్పుకొచ్చారు. బిజెపిలోకి వెళ్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయారు.

# లోకం మాధవి తీరు అంతంతే

విజయనగరం, ఏప్రిల్ 7, నెలిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి పై టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెలిమర్ల స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. లోకం మాధవి జనసేనలో నే కాదు.. ఏపీలోని మహిళ ఎమ్మెల్యేల్లో అత్యంత ధనవంతుల్లో ఒకరు. ఆమె ఆస్తులు వందల కోట్లు ఉంటాయి. గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన లోకం మాధవి గెలుపొందారు. అయితే జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్థానిక టీడీపీ నాయకత్వంతో ఆమెకు కుదరడం లేదు. అనేక విషయాల్లో లోకం మాధవికి, టీడీపీ స్థానిక నేతలకు మధ్య పొసగడం లేదు.లోకం మాధవి తమను పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఇప్పటికే పలు సార్లు తమ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టు పనులు, నామినేటెడ్ పోస్టుల విషయంలో టీడీపీ నేతలను పట్టించుకోవడం లేదన్నది వారి ప్రధాన ఆరోపణ. అలాగే సంక్షేమ పథకాలు, పనుల ప్రారంభోత్సవాల్లోనూ తమకు ఆహ్వానం ఇవ్వడం లేదని వారు



చెబుతున్నారు. తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా లోకం మాధవి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తాము గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడి గెలిపించిన సంగతిని మర్చిపోతే ఎలా అని ?డీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఎమ్మెల్యే భర్త వ్యవహార శైలి కూడా తమకు ఇబ్బందికరంగా మారిందని లోకం మాధవి చెప్పారు. లోకం మాధవి మాత్రం తనకు టీడీపీ నేతలు సహకరించడం లేదని, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో వారు పెత్తనం చేసేందుకు ప్రయత్నిస్తునారని, అధికారులతో మాట్లాడుకుంటూ తనకు సమాచారం ఇవ్వకుండా పనులు చక్కబెట్టుకుంటున్నారని లోకం మాధవి ఆరోపి?తున్నారు. లోకం మాధవి హాజరయ్యే సమావేశాలకు నెలిమర్ల టీడీపీ నేతలు హాజరు కావడం లేదు. దీంతో నెలిమర్ల కూటమి పరా?టీల మధ్య విభేదాలు మరింత ముదిరినట్లియింది. ఇరు పార్టీల నాయకత్వం దీనిపై జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# స్కూల్స్ దగ్గరకు స్వచ్ఛ రధాలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 7, గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా పనికిరాని వస్తువులను సేకరిస్తూ.. వాటికి బదులుగా నగదు, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ స్వచ్ఛ రథాలను ఇళ్ల వద్దకే కాకుండా పాఠశాలల వద్దకు కూడా పంపిస్తున్నారు. విద్యార్థుల నుంచి పనికిరాని వస్తువులను సేకరించి.. అందుకు బదులుగా వారికి అవసరమైన అట్టలు, పుస్తకాలు, పెన్నులు అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను తీసుకువచ్చింది. ఈ స్వచ్ఛ రథాలు ప్రతి వారం గ్రామాల్లోకి వెళ్తూ.. ఇంటింటి నుంచి చెత్త, పనికిరాని వస్తువులను సేకరిస్తూ ఉంటాయి. అందుకు బదులుగా ఉచితంగా నిత్యావసర సరుకులు అందిస్తుంటారు. ఈ స్వచ్ఛ రథం కాన్సెప్ట్‌ను కొన్నిచోట్ల ప్రయోగాత్మకంగా పరిశీలించగా.. మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు చాలా చోట్ల స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా పాఠశాలల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు.అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వారంలో ప్రతి గురువారం పాఠశాలలను సందర్శిస్తున్న స్వచ్ఛ రథాల సిబ్బంది.. విద్యార్థులు తెచ్చిన పనికిరాని వస్తువులను సేకరించి, వాటి విలువను లెక్క గట్టి.. అందుకు బదులుగా పెన్నులు, పుస్తకాలు, అట్టలు అందిస్తున్నారు. ఇళ్లలోని పనికి రాని వస్తువులను తీసుకుంటున్న స్వచ్ఛ రథం సిబ్బంది.. వాటికి బదులుగా గ్రామస్థులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. అలాగే ఇప్పుడు గురువారం రోజున పాఠశాలల వద్దకు వెళ్లి.. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద నుంచి ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులను స్వీకరించి.. మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు లేదా అవసరమైన సరుకులు అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అట్టలు, పెన్నులు, పుస్తకాలు అందిస్తున్నారు.మరోవైపు స్వచ్ఛ రథం సిబ్బంది కేజీ ఇనుముకు రూ.20, పాత పేపర్లకు రూ.15, పుస్తకాలు, అట్టపెట్టెలకు రూ.10, కేజీ ప్లాస్టిక్ సీసాలు రూ.20, అల్యూమినియం వస్తువులు అయితే రూ.120 చొప్పున చెల్లిస్తున్నారు. వీటికి బదులుగా కొబ్బరి నూనె, సబ్బులు, ఉల్లిపాయలు, గోధుమ పిండి, కందిపప్పు వంటి నిత్యావసర సరకులు అందిస్తున్నారు. సరకులు అవసరం లేని వారికి నగదు అందిస్తున్నారు.మరోవైపు పాఠశాలల్లో ఎక్కువగా పొడి చెత్త ఉత్పన్నం అవుతోంది. దీని వలన పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో స్కూళ్ల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగానూ ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

# పోలీసు స్టేషన్ ముందు రైతుల అందోళన

పరిగి,పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట 1200 ఎకరాల రైతుల భూమిని గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. తమకు మద్దతుగా హరీష్ రావు వస్తున్నాడని అనుమతి ఇవ్వకుండా రైతులను పరిగి పోలీస్ స్టేషన్లో పెట్టినట్లు రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ ముందు కాళ్లాపూర్ రైతులు, గ్రామస్తుల ఆందోళన కు దిగారు. తమ 1200 ఎకరాలు పోతున్నాయని రైతులు చేస్తున్న రైతుల రిలే నిరవదిక దీక్షకు మద్దతుగా మంగళవారం హరీష్ రావు రానున్న నేపథ్యంలో పర్మిషన్ కోసం పోలీస్టేషన్కు గ్రామ రైతులు వచ్చారు. వారికి పోలీసులు పర్మిషన్ ను నిరాకరించించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పర్మిషన్ ఎందుకు ఇవ్వరు అంటూ రైతులు నిలదీసారు. పోలీస్టేషన్ ముందు కాళ్లపూర్ గ్రామస్తులు, రైతులు బైఠాయించారు. కొంతమంది రైతులను గ్రామస్తులను పోలీస్టేషన్ లోనే ఉంచివేసారు. ఈ ఆందోళనలో పోలీస్టేషన్ గేట్ ను పోలీసులు మూసివేయడంతో రైతులు గేటు పైకి ఎక్కి ఆందోళన చేపట్టారు.

# చియా గింజలు ఎప్పుడు తింటే బరువు తగ్గుతారు?



చియా గింజలు ఆరోగ్యానికి చాలా మంచివి. బరువు తగ్గాలనుకునే వారు వీటిని ఎక్కువగా తీసుకుంటారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచి, బరువు తగ్గడంలో సహాయపడతాయి. అయితే, చియా గింజలు ఎప్పుడు తింటే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో తెలుసుకోవడం కూడా ముఖ్యం.

**ఉదయం , సాయంత్రం**

ఉదయం చియా గింజలు తీసుకుంటే రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇవి ఎక్కువసేపు ఆకలి లేకుండా చేస్తాయి. అందువల్ల ఎక్కువగా తినకుండా ఉండగలుగుతారు. జీర్ణక్రియ కూడా బాగుంటుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. సాయంత్రం చియా గింజలు తీసుకుంటే రాత్రి ఎక్కువగా తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో కేలరీలు తగ్గి బరువు తగ్గడం సులభమవుతుంది. అలాగే జీర్ణక్రియ మెరుగుపడి, మరుసటి రోజు ఉదయం కడుపు తేలికగా ఉంటుంది.

**ఎలా తీసుకోవాలి?**

చియా గింజలను నేరుగా తినకూడదు. ముందుగా ఒక గ్లాసు నీటిలో ఒక టీస్పూన్ చియా గింజలను వేసి కనీసం 30 నిమిషాలు నానబెట్టాలి. తర్వాత ఆ నీటిని తాగాలి. వీటిని పెరుగు, పాలు, పండ్ల రసాలలో కూడా కలుపుకుని తీసుకోవచ్చు.

**ఎప్పుడు తినడం మంచిది?**

మీరు ఎక్కువగా తినకుండా ఉండాలంటే చియా గింజలను ఉదయం తీసుకోవచ్చు. రాత్రి ఆకలి తగ్గించుకోవాలంటే సాయంత్రం తీసుకోవడం మంచిది. చియా గింజలు బరువు తగ్గడంలో సహాయపడతాయి. కానీ వాటిని మితంగా, సరైన సమయంలో తీసుకుంటేనే మంచి ఫలితాలు పొందవచ్చు.

# ఇంట్లో దోమలు ఎక్కువయ్యాయా?
## ఈ చిట్కాలతో చెక్ పెట్టండి!



ఎండాకాలం మొదలైంది.. ఈగలు, దోమలు ఇంట్లోకి ప్రవేశించి చికాకు తెప్పిస్తుంటాయి. ఎప్పుడు మలేరియా వస్తుందో... డెంగ్యూ వస్తుందో అని భయం. అందుకే సాధ్యమైనంత వరకు సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు మూసి వేస్తుంటారు. సాధారణంగా దోమలను తరిమికొట్టడానికి రసాయనాలతో కూడిన మస్కిటో కాయిల్స్ లేదా లిక్విడ్స్ వాడుతుంటారు. వాటి వల్ల కొందరికి శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే ఇంట్లోనే లభించే సహజ సిద్ధమైన వస్తువులతో దోమలకు ఎలా చెక్ పెట్టొచ్చో తెలుసుకుందాం.

**1. లావెండర్ మొక్క:** ఈ మొక్క దోమల నివారణకు బాగా సహాయపడతాయి. కేవలం దోమలను మాత్రమే కాకుండా ఇతర తెగుళ్లు, ఎలుకలు, ఈగలను దూరంగా ఉంచుతాయి. ఈ మొక్కలు చిన్నవిగా ఉండటం వల్ల ఇంట్లో పెంచుకోవడానికి వీలుగా ఉంటాయి.

**2. వేప నూనె**: వేప నూనెను కొబ్బరి నూనెతో కలిపి ఒంటికి రాసుకోవడం వల్ల లేదా దీపంలా వెలిగించడం వల్ల దోమలు దరిచేరవు

**3. కర్పూరం:** గదిలో కర్పూరాన్ని వెలిగించి, కిటికీలు, తలుపులు ఒక 15 నిమిషాల పాటు మూసివేస్తే దోమలు పారిపోతాయి.

**4. వెల్లుల్లి:** వెల్లుల్లి రెబ్బలను నీటిలో ఉడికించి, ఆ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి గది మూలల్లో చల్లితే దోమల ఉధృతి తగ్గుతుంది.

**5. నిమ్మకాయ, లవంగాలు**: సగం కోసిన నిమ్మకాయ ముక్కల మధ్య లవంగాలను పెట్టి దోమలు ఉన్న చోట ఉంచితే.. ఆ వాసనకు పావు గంటలో దోమలన్నీ బయటికి వెళ్లిపోతాయి.

**6. తేనె:** ఏదైనా పేపర్ ముక్కపై తేనె రాయండి. దోమలు ఉన్న చోటు ఉంచండి. తేనె తీపి దోమలను ఆకర్షిస్తాయి. పేపర్‌పై వాలిన దోమలు ఎగిరిపోలేని పరిస్థితి. దాంతో కొద్దిసేపటి తర్వాత చనిపోతాయి.

**ఇంటి పరిసరాల పరిశుభ్రత:**

దోమలు పెరగకుండా ఉండాలంటే వాటి నివాస స్థలాలను దెబ్బతీయాలి. కుండలు, పాత టైర్లు, కూలర్లు లేదా పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమలు నిల్వ ఉన్న నీటిలోనే గుడ్లు పెడతాయి. కిటికీలకు, తలుపులకు సన్నని జాలీలను అమర్చు కోవడం వల్ల గాలి వస్తుంది కానీ దోమలు లోపలికి రావు.

**దోమలను తరిమే మొక్కలు:**

ఇంట్లో లేదా బాల్కనీలో కొన్ని ప్రత్యేకమైన మొక్కలను పెంచడం ద్వారా సహజంగానే దోమలను నియంత్రించవచ్చు. లెమన్ గ్రాస్‌లో ఉండే సిట్రోనెల్లా అనే పదార్థం దోమలను సమర్థవంతంగా అడ్డుకుంటుంది. పుదీనా వాసన దోమలకు పడదు. ఇది ఇంటికి మంచి సువాసనను కూడా ఇస్తుంది.

# వేసవి తాపాన్ని తరిమికొట్టే అమృత పానీయాలు..
## ఈ డ్రింక్స్‌తో మీ ఎనర్జీ డబుల్!

ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వేసవిలో కేవలం నీళ్లు తాగడం వల్ల మాత్రమే దాహం తీరదు, శరీరానికి అవసరమైన పోషకాలు, ఎలక్ట్రోలైట్స్ కూడా అందాలి. నీరసాన్ని తగ్గించి, రోజంతా మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచే కొన్ని సహజ సిద్ధమైన పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**1. శికంజీ:** ఈ రెసిపీని నిమ్మకాయ, సుగంధ ద్రవ్యాలు, పుదీనా ఆకులతో తయారు చేస్తారు. మంచి రుచితో పాటు వేసవి తాపాన్ని కూడా తగ్గిస్తుంది.

2. నిమ్మకాయ, చక్కెర, నీటితో తయారు చేసే ఈ డ్రింక్ వేసవి తాపాన్ని తగ్గిస్తుంది. కడుపు చల్లగా ఉండేలా చేస్తుంది. వేసవిలో చాలా ఎక్కువమంది తాగే పానీయం ఇది.

3. కొబ్బరినీళ్లు ఇది ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఎనర్జీ డ్రింక్. ఇందులో ఉండే ఎలక్ట్రోలైట్స్ శరీరంలోని డీహైడ్రేషన్‌ను తగ్గించి తక్షణ శక్తినిస్తాయి.

4.వేసవిలో శరీరానికి చలువ చేయడానికి మజ్జిగను మించిన పానీయం లేదు. ఇందులో కొంచెం అల్లం, కొత్తిమీర, ఉప్పు కలిపి తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడి శక్తి వస్తుంది.

5.రాగులలో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. రాగి పిండిని నీళ్లలో ఉడికించి, మజ్జిగ లేదా బెల్లం కలిపి తాగితే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. ఇది ఎండ వేడి తట్టుకునే శక్తినిస్తుంది.

6. చెరుకు రసంలో గ్లూకోజ్ ఉంటుంది. తక్షణ శక్తి కావాలనుకున్నప్పుడు చెరుకు రసం తాగితే మంచిది. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

7. పుచ్చకాయలో 90 శాతానికి పైగా నీరు ఉంటుంది. ఇందులో ఉండే లైకోపీన్, అమినో యాసిడ్స్ అలసటను తగ్గించి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి.

8. సబ్జా గింజలను నీళ్లలో నానబెట్టి, ఆ నీటిని నిమ్మరసంలో లేదా కొబ్బరి నీళ్లలో కలిపి తాగితే శరీర ఉష్ణోగ్రత వెంటనే తగ్గుతుంది.




# వేసవిలో తప్పక తినాల్సిన పండ్లు ఇవే



వేసవి ఎండలు రోజురోజుకీ తీవ్రంగా మారుతున్నాయి. ఉదయం నుంచే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు బయటకు వెళ్లడాన్ని కష్టతరం చేస్తున్నాయి. ఈ వేడి కారణంగా శరీరంలో నీటి శాతం డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. తాత్కాలిక ఉపశమనం కోసం తీపి పానీయాలపై ఆధారపడటం కంటే, సహజంగా శరీరాన్ని చల్లగా ఉంచే పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

**పుచ్చకాయ:**

వేసవిలో ఎక్కువగా తినాల్సిన పండు పుచ్చకాయ. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహం తీరుతుంది. జీర్ణక్రియకు కూడా ఇది సహాయపడుతుంది.

**బొప్పాయి:**

జీర్ణ సమస్యలు తగ్గించడానికి బొప్పాయి చాలా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఎంజైములు ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడతాయి.

**మామిడి:**



వేసవి కాలం అంటేనే మామిడి పండ్ల సీజన్. ఇది శరీరానికి శక్తినిస్తుంది, పేగులకు చాలా మంచిది. కానీ ఎక్కువగా తింటే బరువు పెరగడం, చక్కెర స్థాయిలు పెరగడం జరుగుతుంది. కాబట్టి మితంగా తినాలి.

**అరటిపండ్లు:**

అరటి పండ్లు పోషకాల గని. తక్షణ శక్తినిచ్చే అద్భుతమైన పండు. ఇవి పొటాషియం, విటమిన్లు, ఫైబర్‌తో నిండి ఉండి, గుండె ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణ, జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తాయి. సీజన్‌తో సంబంధం లేకుండా చౌకగా లభించే ఈ పండ్లు శరీర పెరుగుదలకు, ఎముకల దృఢత్వానికి చాలా అవసరం.


**పైనాపిల్:**

పైనాపిల్‌లో జీర్ణక్రియకు సహాయపడే ఎంజైములు ఉంటాయి. ఇవి శరీరంలో వాపు తగ్గించడంలో కూడా సహాయపడతాయి. వేసవిలో కేవలం శీతల పానీయాలపై ఆధారపడకుండా, ఇలాంటి సహజ పండ్లు తినడం వల్ల





# నిద్రలేమి వల్ల వచ్చే సమస్యలు ఇవే



ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం, మంచి జీవనశైలి ఎంత ముఖ్యమో, ప్రతిరోజూ సరిపడా నిద్ర కూడా అంతే అవసరం. రోజుకు కనీసం 7?8 గంటలు నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**నిద్రలేమి వల్ల కలిగే సమస్యలు**

అధిక రక్తపోటు
మధుమేహం
ఊబకాయం
గుండె జబ్బులు
డిప్రెషన్, ఆందోళన

పగటిపూట నిద్రలేమి ఉన్నవారు ఏకాగ్రత కోల్పోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తలనొప్పి, చిరాకు వంటి సమస్యలను ఎదుర్కొంటారు.

**మానసిక ఆరోగ్యంపై ప్రభావం**

నిద్రలేమి వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది డిప్రెషన్‌కు దారితీయవచ్చు. పిల్లల్లో ఇది చదువుపై ప్రభావం చూపి, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తన మార్పులకు కారణమవుతుంది.

**ఈ లక్షణాలు చెక్ చేయండి**

ఎప్పుడూ అలసటగా అనిపించడం
తలనొప్పి, కళ్లలో మంట
ఏకాగ్రత లోపం
చిరాకు
తరచుగా అనారోగ్యం
వాహనం నడుపుతున్నప్పుడు నిద్రమత్తు
టీవీ చూస్తూ లేదా చదువుతూ త్వరగా నిద్ర రావడం
జ్ఞాపకశక్తి తగ్గడం
పగటిపూట ఎక్కువ నిద్ర రావడం

ఈ లక్షణాలలో రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, నిద్రలేమి సమస్య ఉండే అవకాశం ఉంది. నిద్రను నిర్లక్ష్యం చేయడం ఆరోగ్యానికి ప్రమాదకరం. కాబట్టి ప్రతి రోజూ సరిపడా నిద్రపోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సమస్య కొనసాగితే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# వాల్‌నట్ , బాదం.. మెదడు
## ఆరోగ్యానికి ఏది మంచిది?




: మన శరీరంలోని అన్ని కార్యకలాపాలను నియంత్రించే ప్రధాన అవయవం మెదడు. అందుకే మెదడు ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. మంచి జీవనశైలి, సరైన ఆహారం ద్వారా మెదడు పనితీరును మెరుగుపరచవచ్చు. వాల్‌నట్‌లు, బాదంపప్పులు వంటి డ్రైఫ్రూట్స్ మెదడు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అయితే, ఈ రెండింటిలో ఏది ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం..

**వాల్‌నట్‌ల ప్రయోజనాలు**

వాల్‌నట్‌లు మెదడు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరమైనవి. ఇవి అభిజ్ఞా సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, రోజూ లేదా వారానికి కొన్ని సార్లు వాల్‌నట్‌లు తినే పిల్లలు, యువతలో ఏకాగ్రత మెరుగుపడింది. ప్రత్యేకంగా వాల్‌నట్‌లలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్ (ఒఎం) మెదడు అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగడానికి ఉపయోగపడుతుంది. అలాగే నాడీ సంబంధిత సమస్యలను తగ్గించడంలో కూడా తోడ్పడుతుంది.

**బాదంపప్పుల ప్రయోజనాలు**

బాదంపప్పులు కూడా మెదడుకు చాలా మంచివి. వీటిలో విటమిన్ ఇ, మెగ్నీషియం, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి మెదడును రక్షించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో సహాయపడతాయి. బాదం పప్పులు ముఖ్యంగా జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో, శరీరానికి అవసరమైన మంచి కొవ్వులను అందించడంలో ఉపయోగపడతాయి. అలాగే కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

**ఏది ఎక్కువ మంచిది?**

వాల్‌నట్‌లు, బాదంపప్పులు రెండూ మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే ఏది ఎక్కువ ప్రయోజనకరమో అనేది వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. మెదడు అభివృద్ధి, ఏకాగ్రత కోసం వాల్‌నట్‌లు ఎక్కువ ఉపయోగకరం. శక్తి, పోషకాలు, గుండె ఆరోగ్యం కోసం.. బాదంపప్పులు మంచివని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచాలంటే వాల్‌నట్‌లు, బాదంపప్పులు రెండింటినీ ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం. ప్రతి రోజూ మితంగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.



# స్పోర్ట్స్ న్యూస్

## గాయంతో ఆటకు దూరమైన మిచెల్ స్టార్క్.. బరిలోకి దిగేదెప్పుడో?

ఐపీఎల్ 2026 ఉత్సాహంగా కొనసాగుతున్న వేళ.. ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ గాయం బారిన పడిన సంగతి తెలిసిందే. తీవ్రత ఎక్కువ ఉండటంతో స్టార్క్ మరికొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించి ఊపు మీదున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు స్టార్క్ గైర్హాజరు పెద్ద లోటుగా మారే అవకాశం ఉంది. అయితే స్టార్క్ త్వరగా కోలుకుని తిరిగి జట్టులో చేరాలని అభిమానులు కోరుకుంటున్నారు.స్టార్క్ భుజం, మోచేతి గాయాల నుంచి కోలుకుంటున్నాడు. గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో కనీసం మరో మూడు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉన్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ 20 తర్వాతే స్టార్క్ తిరిగి జట్టులోకి చేరుతాడని తెలిపాయి. అయితే ఇప్పటికీ పాయింట్ల పట్టికలో గెలుపు ఖాతా తెరవని గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ తదుపరి మ్యాచ్‌లు జరగనున్నాయి. గెలుపు కోసం శ్రమిస్తోన్న ఈ ఇరు జట్లు డీసీకి గట్టి పోటీనిచ్చే అవకాశం లేకపోలేదు. ఇలాంటి మ్యాచ్‌లకు స్టార్క్ లేకపోవడం పెద్ద సమస్యగా మారనుంది.ప్రస్తుతం జట్టు బౌలింగ్ బాధ్యతలను ముకేశ్ కుమార్, నటరాజన్ ముందుండి నడిపిస్తుండగా.. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ స్టార్క్ కూడా జట్టులో చేరితే బౌలింగ్ దళం మరింత బలపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఐపీఎల్‌లో ఆలస్యంగా చేరడంపై స్టార్క్ ఘాటుగా స్పందించిన విషయం తెలిసిందే. గాయాల కారణంగానే ప్రారంభ మ్యాచ్‌లకు దూరమయ్యానని అతడు స్పష్టం చేశాడు. తన నిబద్ధతపై సందేహాలు వ్యక్తం చేసిన వారిపై అసహనం వ్యక్తం చేస్తూ 'నా శరీరం గురించి నాకు తెలుసు' అంటూ కౌంటర్ ఇచ్చాడు. అలాగే, జట్టుకు ముఖ్య సమయాల్లో అందుబాటులో లేకపోవడం బాధాకరమని అంగీకరించిన స్టార్క్.. అభిమానులకు క్షమాపణలు చెబుతూ త్వరలోనే జట్టుతో కలుస్తానని హామీ ఇచ్చాడు. మొత్తంగా స్టార్ పేసర్ గైర్హాజరు ఢిల్లీ క్యాపిటల్స్‌కు పరీక్షగా మారింది. రాబోయే మ్యాచ్‌ల్లో ఈ లోటును జట్టు ఎలా భర్తీ చేస్తుందో చూడాలి.




## బీసీసీఐ వల్ల ఐపీఎల్‌కు రూ.2400కోట్ల నష్టం... లలిత్ మోదీ సంచలన వ్యాఖ్యలు

ఐపీఎల్ నిర్వహణపై మరోసారి చర్చ చెలరేగింది. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ బీసీసీఐ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయాల వల్ల ఏటా రూ.2400కోట్ల వరకు ఐపీఎల్‌కు నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ప్రస్తుతం లీగ్‌లో 10 జట్లు ఉన్నప్పటికీ కేవలం 74 మ్యాచ్‌లతోనే టోర్నీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అసలు ఫార్మాట్ ప్రకారం ప్రతి జట్టు ఒకే ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడితే లీగ్ దశలోనే 90 మ్యాచ్‌లు, ప్లే ఆఫ్స్ కలిపి మొత్తం 94 మ్యాచ్‌లు జరగాల్సి ఉందని లలిత్ మోదీ వెల్లడించారు.అతి కొద్ది కాలంలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్.. ఐపీఎల్. ఇటీవలే ఈ టోర్నీ ప్రసార హక్కులు ఏకంగా రూ.48,390 కోట్లకు అమ్ముడుపోయాయి. దానికి తోడు ఈ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు భారీ మొత్తానికి అమ్ముడైన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా లలిత్ మోదీ స్పందించారు. 'ఒక్కో మ్యాచ్‌కు మీడియా హక్కుల ద్వారా భారీ ఆదాయం వస్తోంది. సొంత మైదానంతో పాటు బయటి గ్రౌండ్‌లో కూడా మ్యాచ్‌లు ఆడే విధానం అమలు చేస్తే అదనంగా వేల కోట్ల రూపాయలు బీసీసీఐ ఖజానాలో చేరేవి. ఆ ఆదాయంలో సగం ఫ్రాంచైజీలకు వెళ్తుంది. దాంతో జట్ల విలువ కూడా మరింత పెరుగుతుంది' అని లలిత్ అభిప్రాయపడ్డారు.'ఇటీవల ఆర్సీబీ, ఆర్ఆర్ జట్లు భారీ విలువలకు అమ్ముడుపోవడం నాకు ఆనందంగా ఉంది. కానీ జట్లకు హామీ ఇచ్చిన ఫార్మాట్‌ను అమలు చేయకపోవడం వాణిజ్య ఒప్పందానికి విరుద్ధం. ఐపీఎల్ ప్రారంభమైన తొలినాళ్లలో 8 జట్లు మాత్రమే ఉండేవి. ప్రతి జట్టు సొంత మైదానంతో పాటు బయటి గ్రౌండ్‌లో ఒకే ప్రత్యర్థితో రెండు మ్యాచ్‌లు తప్పనిసరిగా ఆడేవి. కానీ ఇప్పుడు లీగ్‌లో పది జట్లున్నాయి. అయినప్పటికీ మ్యాచ్‌ల సంఖ్య 74 మాత్రమే. నిజానికి ఈ ఫార్మాట్ మోడల్‌ను మేము విక్రయించలేదు. ప్రతి జట్టు హోం గ్రౌండ్‌తో పాటు బయట కూడా మ్యాచ్‌లు ఆడేలా ఫార్మాట్ రూపొందించాం. ఒకవేళ 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు క్యాలెండర్ సహకరించకపోతే.. అప్పుడు జట్ల సంఖ్య పెంచకుండా ఉండాల్సింది' అని లలిత్ మోదీ చెప్పుకొచ్చారు.



## వైభవ్ విషయంలో జాగ్రత్త పడాల్సిన అవసరం లేదు: ముంబై కోచ్ పరాస్

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా మరో పోరు జరగనుంది. గువాహటి వేదికగా ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచుల్లో విజయం సాధించి.. రాజస్థాన్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ మ్యాచ్ కూడా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేయాలనే కసితో ఆర్ఆర్ జట్టు ఉంది. అటు ముంబై రెండు మ్యాచ్‌లు ఆడగా.. ఒక మ్యాచ్ లో మాత్రమే విజయం సాధించి. పాయింట్ల పట్టికలో ఆరోస్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీ, ముంబై స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కాంబినేషన్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇవాళ జరిగే మ్యాచ్‌కు సంబంధించి పలు విషయాలను ముంబై బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే మీడియాతో మాట్లాడాడు. సూర్యవంశీ వల్ల కలిగే ముప్పు కొత్తదేనా అని మీడియా ప్రశ్నించగా...వైభవ్ ఆట తమకు కొత్తేం కాదని సమాధానం ఇచ్చాడు. ఐపీఎల్ (ఎఖఒ 2026)లో అతడికి ఇది రెండో సీజన్ అని, చాలా అద్భుతంగా రాణిస్తున్నాడని తెలిపాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీకి వైభవ్ విలువైన ఆటగాడని, అయితే, అతడి ఆటతీరు తమకు కొత్తేం కాదని వెల్లడించాడు. అలానే వైభవ్ విషయంలో ముంబై జట్టు ఆందోళన చెందాల్సిన పని లేదన్నాడు.ఇతర ఆటగాళ్లను ఎదుర్కొనేందుకు ఎలా సన్నద్ధమవుతామో వైభవ్ విషయంలోనూ అలాగే వ్యవహరిస్తామని పరాస్ తెలిపాడు. రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ గురించి కూడా తమకు ఆందోళన లేదని పరాస్ పేర్కొన్నాడు. రవిని మిస్టరీ స్పిన్నర్ అని భావించట్లేదని, గత కొన్నేళ్లుగా ఎలా బౌలింగ్ చేస్తున్నాడో.. ఈ ఏడాది అలాగే ఉందని తెలిపాడు. మ్యాచ్ ప్రారంభం అయ్యాక మైదానంలో ఏదైనా జరగొచ్చని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు తమ జట్టు సిద్ధమేనని పరాస్ వెల్లడించాడు.




## ఫైనల్‌కు ప్రీతి.. టైటిల్ పోరుకు ప్రియ, అరుంధతి సెమీస్‌లో నిఖత్, లవ్లీనా ఓటమి



ఉలన్‌బాతర్ (మంగోలియా) : ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ప్రీతి పవార్, ప్రియా, అరుంధతి ఫైనల్‌కు దూసుకెళ్లారు. సోమవారం ఇక్కడ జరిగిన సెమీస్ పోరులో ఈ ముగ్గురూ తమ ప్రత్యర్థులను చిత్తుచేసి పసిడి పతక పోరుకు అర్హత సాధించారు. మహిళల 54 కిలోల సెమీస్‌లో ప్రీతి.. 5-0తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఇమ్ ఎజి (దక్షిణ కొరియా)ను చిత్తుచేసింది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిని తన పంచ్ పవర్‌తో బెంబేలెత్తించిన ప్రీతి.. ఫైనల్ పోరులో మూడుసార్లు వరల్డ్ చాంపియన్ అయిన చైనీస్ తైపీ బాక్సర్ హువాంగ్ సియావొ-వెన్‌తో తలపడనుంది.60 కిలోల విభాగంలో ప్రియ.. 5-0తో నమున్ మొంకొర్ (మంగోలియా)ను ఓడించింది. 70 కేజీల సెమీస్‌లో అరుంధతి.. 4-1తో తొయిరొవ (ఉజ్బెకిస్థాన్)ను మట్టికరిపించింది. ఇదిలాఉండగా మాజీ వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహెయిన్ పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. నిఖత్.. 0-5తో పారిస్ ఒలింపిక్ విజేత వు యు (చైనా) చేతిలో ఓడగా లవ్లీనా.. 0-5తో అజిజ జొకిరొవ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఖంగుతింది. పూజారాణి, అంకుషిత సైతం సెమీస్‌లో ఓటమిపాలై కాంస్యాలతో సంతృప్తి పడ్డారు.

## ఓటములకు బౌలర్లను మాత్రమే కారణంగా చూపొద్దు: క్లాసెన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆశించిన స్థాయిలో ప్రదర్శన కనబర్చడం లేదు. విధ్వంసకర బ్యాటర్లు ఉన్నప్పటికీ జట్టుకు ఓటములు తప్పట్లేదు. ఆడిన మూడు మ్యాచుల్లో రెండు ఓడి కేవలం ఒక్కటే మ్యాచ్ గెలిచిన సంగతి తెలిసిందే. ప్రధాన పేసర్ ప్యాట్ కమిన్స్ లేకపోవడం జట్టుకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం బలహీనంగా ఉందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఎస్ఆర్‌హెచ్ స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ ఘాటుగా స్పందించాడు. జట్టు బౌలింగ్‌పై వస్తోన్న విమర్శలను ఖండించాడు.'ఆడిన మూడు మ్యాచ్‌ల్లో మేము దాదాపు 40 పరుగులు తక్కువ చేశాం. బ్యాటింగ్ ఇంకా చాలా మెరుగుపరుచుకోవాలి. ఒక టీమ్‌లో కమిన్స్ లాంటి ఆటగాడు లేకపోవడం పెద్ద లోటే. కానీ ఓటములకు బౌలర్లను మాత్రమే కారణంగా చూపించడం సరైంది కాదు. ఓటములకు బ్యాటర్లే బాధ్యత వహించాలి. మా బ్యాటింగ్ యూనిట్ లక్ష్యం స్పష్టంగా ఉంది. ప్రతి మ్యాచ్‌లో కనీసం 220-230 పరుగులు చేయాలని నిర్ణయించాం. భారీ స్కోర్లు సాధిస్తేనే బౌలర్లకు మ్యాచ్‌ను కాపాడే అవకాశం ఉంటుంది. బౌలర్లు అనుభవం లేని వారంటూ విమర్శించడం సులభం. కానీ మేమే 20-30 పరుగులు తక్కువ చేశాం. మేము మా పని సరిగ్గా చేస్తే బౌలర్లపై ఒత్తిడి తగ్గుతుంది' అని క్లాసెన్ స్పష్టం చేశాడు.



## సినీ నటితో టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ ప్రేమాయణం!

సినీ, క్రీడా రంగాలకు చెందిన వారి ప్రేమలు, డేటింగ్స్ వంటి వాటి గురించి తరచూ వార్తలు వస్తూనే ఉంటాయి. వీటిల్లో కొన్ని నిజం కాగా.. మరికొన్ని పుకార్లుగా మిలిగిపోతుంటాయి. తాజాగా.. టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రేమలో మునిగి తేలుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అర్ష్‌దీప్ ఇటీవలే తన స్నాప్‌చాట్ అకౌంట్లో ఓ యువతితో చేతులు పట్టుకుని ఉన్న ఫొటోను షేర్ చేశాడు. అందులో ఆమె ముఖం కనిపించకపోయినప్పటికీ, నెట్టిజన్లు ఓ చిన్న క్లూ ద్వారా ఆమె ఎవరో కనిపెట్టేశారు. ఫలానా నటి అంటూ నెటిజన్లే వివరాలు చెప్పేస్తున్నారు.అర్ష్‌దీప్ పట్టుకున్న ఆ అమ్మాయి చేతిపై ఒక ప్రత్యేకమైన టాటూ ఉంది. పంజాబ్‌కు చెందిన మోడల్, నటి సమ్రీన్ కౌర్( చేతిపై కూడా సరిగ్గా అదే టాటూ ఉంటుంది. దీంతో అర్ష్‌దీప్ చేయి పట్టుకున్న అమ్మాయి ఆమెనేనని, వారిద్దరూ లవ్‌లో ఉన్నట్లు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇటీవల ముల్లన్‌పూర్‌లో జరిగిన పంజాబ్ కింగ్స్ మ్యాచ్ సందర్భంగా సమ్రీన్ పీబీకేఎస్ జెర్సీ ధరించి ఉన్న ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో ఈ వదంతులకు మరింత బలాన్ని చేకూర్చినట్లయింది.పంజాబ్‌కు చెందిన సమ్రీన్(26).. పుణేలోని సింబయాసిస్ కాలేజీలో చదువుకుంది. అనేక పంజాబీ మ్యూజిక్ వీడియోలు, ఓటీటీ చిత్రాలలో నటించిన ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. '83' అనే బాలీవుడ్ మూవీలో కూడా ఆమె నటించింది. 2018 మిస్ ఇండియా పోటీల్లో ఫైనలిస్ట్‌గా నిలిచింది. మరోవైపు ప్రస్తుతం వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంపై ఇటు అర్ష్‌దీప్ కానీ, అటు సమ్రీన్ కానీ స్పందించలేదు. అయినప్పటికీ వీరిద్దరి మధ్య ఏదో విషయం ఉందన్న వార్త మాత్రం నెట్టింట్లో తెగ వైరల్ అవుతోంది.








# మానస శర్మను చూసి ఆ విషయంలో స్ఫూర్తి పొందిన అనిల్ రావిపూడి..నిజంగా గ్రేట్!




: కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఏప్రిల్ 10న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ నవ్వుల పువ్వులు పూయించింది. ముఖ్యంగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత దిల్ రాజు మధ్య జరిగిన సరదా మాటల యుద్ధం హైలైట్‌గా నిలిచింది. మానస శర్మ సైలెంట్ రియాక్షన్‌ను చూసి తను కూడా ఇన్ స్పైర్ అయ్యానంటూ అనిల్ రావిపూడి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మానస స్టైల్‌లో అనిల్ సైలెంట్ రియాక్షన్: ఈవెంట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ డైరెక్టర్ మానస శర్మను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరైనా ఎంత పొగిడినా ఆమె ఏమీ మాట్లాడకుండా చాలా సైలెంట్‌గా, కూల్‌గా రియాక్ట్ అవుతారని.. ఆమెను చూసి తను కూడా ఆ విషయంలో ఇన్‌స్పైర్ అయ్యానని హాస్యాస్పదంగా చెప్పారు. దిల్ రాజు తనను హీరోగా పరిచయం చేస్తానన్నప్పుడు కూడా తను అలాగే సైలెంట్‌గా ఉండిపోయానని అనడంతో ఆడిటోరియంలో నవ్వులు వెల్లువెత్తాయి. అనిల్ తనదైన శైలిలో చేసిన ఈ విశ్లేషణ అందరినీ ఆకట్టుకుంది. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ అనిల్ రావిపూడిపై ప్రశంసలు కురిపిస్తూనే ఒక క్రేజీ ఆఫర్ ఇచ్చారు. "మా అనిల్ చూడటానికి హీరోలా ఉంటాడు.. సరైన కథ కుదిరితే నేనే అతన్ని హీరోగా ఇండస్ట్రీకి పరిచయం చేస్తాను" అని స్టేజ్ పైనే ప్రకటించారు. దీనికి అనిల్ వెంటనే స్పందిస్తూ.. "వుండండయ్యా బాబు.. ప్లీజ్! నా డైరెక్షన్ పని నేను బాగానే చేసుకుంటున్నాను, నన్ను డిస్టర్బ్ చేయొద్దు" అంటూ సరదాగా కౌంటర్ ఇచ్చారు. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఈ సంభాషణతో మరోసారి బయటపడింది. డైరెక్షన్‌పైనే అనిల్ ఫోకస్: హీరోగా ఆఫర్ వచ్చినప్పటికీ, తనకు దర్శకత్వం అంటేనే ప్రాణమని అనిల్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి తన పూర్తి ఫోకస్ డైరెక్షన్‌పైనే ఉందని, ఒకవేళ అవకాశం వస్తే ప్రదీప్ రంగనాథన్ హీరోగా దిల్ రాజు గారి నిర్మాణంలో ఒక సినిమాను డైరెక్ట్ చేయాలని తన కోరిక అని వెల్లడించారు. 'లవ్ టుడే' సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు దగ్గరైన ప్రదీప్‌ను అనిల్ లాంటి మాస్ పల్స్ తెలిసిన దర్శకుడు హ్యాండిల్ చేస్తే ఆ సినిమా రేంజ్ వేరేలా ఉ ంటుందని ఫ్యాన్స్ కూడా సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ 'లవ్' మేనియా: విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని నయనతార నిర్మించడం విశేషం. దిల్ రాజు కూడా ప్రదీప్ టాలెంట్‌ను మెచ్చుకుంటూ ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఏప్రిల్ 10న రిలీజ్ కానున్న ఈ సినిమాతో ప్రదీప్ తెలుగులో తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటాడేమో చూడాలి. అటు విఘ్నేష్ శివన్ మార్క్ కామెడీ, ఇటు ప్రదీప్ యాక్టింగ్ తోడవడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏదేమైనా ఒక సినిమా ఫంక్షన్‌లో కేవలం ప్రమోషన్లే కాకుండా ఇలాంటి సరదా సన్నివేశాలు ఉంటేనే ప్రేక్షకులకు మజా వస్తుంది. అనిల్ రావిపూడి టైమింగ్, దిల్ రాజు సరదా ఆఫర్లు ఈ ఈవెంట్‌ను సక్సెస్ చేశాయి. మరి మానస శర్మను చూసి ఇన్‌స్పైర్ అయిన అనిల్.. తన నెక్స్ట్ సినిమాలో ఆమెను హీరోయిన్‌గా తీసుకుంటారా? లేదా ప్రదీప్‌తో నిజంగానే సినిమా ప్లాన్ చేస్తారా అన్నది వేచి చూడాలి!

# 'బైకర్' ఫస్ట్ వీకెండ్ బాక్సాఫీస్: స్పీడ్ పెంచిన శర్వా




సమ్మర్ సీజన్ మొదలవ్వగానే టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర హడావుడి మొదలైంది. ఈ ఏడాది వేసవి రేసులో శర్వానంద్ తన 'బైకర్' చిత్రంతో గట్టిగానే ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నాడు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ స్పోర్ట్స్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సాధారణంగా ఈ మధ్య కాలంలో సినిమాలకు మొదటి రోజు వచ్చే వసూళ్లు రెండో రోజుకు పడిపోతుంటాయి. కానీ 'బైకర్' విషయంలో సీన్ రివర్స్ అయింది. రోజురోజుకూ ఈ సినిమా వసూళ్లు పెరుగుతుండటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. శర్వానంద్ తన మార్క్ నటనతో మరోసారి ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో సక్సెస్ అయ్యారు. ?ఇక 'బైకర్' సినిమా తన మొదటి వీకెండ్ ముగిసేసరికి ప్రపంచవ్యాప్తంగా రూ. 18.09 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. శుక్రవారం డీసెంట్ ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం పుంజుకుని, ఆదివారం నాటికి తన కెరీర్‌లోనే బెస్ట్ వసూళ్లను నమోదు చేసింది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, సినిమాలో ఉన్న తండ్రి కొడుకుల ఎమోషన్ ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది. యువతను రేసింగ్ సీక్వెన్స్‌లు ఆకట్టుకుంటుంటే, పెద్దలను రాజశేఖర్, శర్వాల మధ్య వచ్చే సెంటిమెంట్ సీన్లు మెప్పిస్తున్నాయి. ఈ బ్యాలెన్స్‌డ్ కంటెంట్ వల్లే సినిమా నిలకడగా వసూళ్లు సాధిస్తోంది. ?సినిమాలోని డైలాగ్స్ కూడా కథకు తగ్గట్టుగా పవర్ ఫుల్‌గా ఉన్నాయి. రాజశేఖర్ పాత్రలో ఉన్న ఏమోషన్ సినిమాకు ఒక వెయిట్ తీసుకొచ్చింది. ఎమోషనల్ డైలాగ్స్ థియేటర్లలో చప్పట్లు కురిపిస్తున్నాయి. ?విజువల్స్ పరంగా 'బైకర్' ఒక కొత్త అనుభూతిని ఇస్తోంది. మోటో క్రాస్ రేసింగ్ ను వెండితెరపై చూపించడంలో టీమ్ చాలా కష్టపడినట్లు అర్థమవుతోంది. కెమెరా వర్క్ ఎడిటింగ్ రేసింగ్ సీన్లలో యూవీ క్రియేషన్స్ ఫ్యాషన్ కనిపించిందనే కామెంట్స్ వస్తున్నాయి. ముఖ్యంగా మట్టిలో బైక్ లతో చేసే విన్యాసాలు చాలా నేచురల్ గా ఉన్నాయి. యాక్షన్ బ్లాక్స్ లో వైలెన్స్ కంటే అడ్వెంచర్ ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలు కూడా ఈ సినిమాను ఇష్టపడుతున్నారు. శర్వానంద్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా రేసింగ్ లో ట్రైనింగ్ తీసుకోవడం ప్రతి ఫ్రేమ్ లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ?ప్రస్తుతం ఈ సినిమాకు ఉన్న అతిపెద్ద బలం మౌత్ టాక్. చూసిన ప్రతి ఒక్కరూ పాజిటివ్ గా చెప్పడం వల్ల వీక్ డేస్ లో కూడా కలెక్షన్లు నిలకడగా ఉండే అవకాశం ఉంది. శర్వానంద్ కెరీర్ లో 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' తర్వాత అంతటి ఎమోషనల్ పర్ఫార్మెన్స్ ఇందులో చూస్తున్నామని ఆడియన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మాళవిక నాయర్ పాత్ర కూడా కథలో చక్కగా ఒదిగిపోయింది. యూవీ క్రియేషన్స్ మేకింగ్ వాల్యూస్ సినిమాను ఒక హై స్టాండర్డ్ లో నిలబెట్టాయి. మొత్తానికి 'బైకర్' తన ఫస్ట్ వీకెండ్ ను ఘనంగా ముగించింది. రాబోయే రోజుల్లో కూడా ఇదే జోరును కొనసాగిస్తే శర్వానంద్ ఖాతాలో ఒక బిగ్గెస్ట్ హిట్ చేరడం ఖాయం. ఒక ప్రయోగంలా మొదలైన ఈ స్పోర్ట్స్ డ్రామా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద కమర్షియల్ గా కూడా వర్కవుట్ అవుతోంది. మరి లాంగ్ రన్ లో ఈ సినిమా ఏ స్థాయి రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.

# చరణ్ 'పెద్ది'.. ఇప్పుడు ఫ్యాన్స్ భయం అదేనా?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం పెద్ది విడుదలపై గత కొన్ని రోజులుగా రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే సినిమా మళ్లీ వాయిదా పడుతుందనే వార్తలకు రామ్ చరణ్ రీసెంట్ గా ఫుల్ స్టాప్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం, ఏప్రిల్ 30న పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రాకాస సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఆ విషయంపై క్లారిటీ ఇచ్చారు. అయితే సినిమాకు సంబంధించిన షూటింగ్ పూర్తయిందా లేదా అనే సందేహాలు కూడా సోషల్ మీడియాలో వినిపించాయి. ఇంకా దాదాపు 20 రోజుల షూటింగ్ మిగిలి ఉందని, ఒక ఐటెం సాంగ్ కూడా చిత్రీకరించాల్సి ఉందని ప్రచారం జరిగింది. దీనికి తోడు హనుమాన్ జయంతి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో రిలీజ్ డేట్ ప్రస్తావించకపోవడం ఆ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. దీంతో పెద్ది విడుదల వాయిదా ఖాయమనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. అయితే మేకర్స్ ఆ వార్తలను కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉందని, ప్యాచ్ వర్క్ శరవేగంగా సాగుతుందని చెబుతున్నారు. మిగిలిన భాగాన్ని వారం రోజుల్లో పూర్తి చేయడంతో పాటు ఐటెం సాంగ్ చిత్రీకరణ త్వరగా ముగించేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేసి, సమయానికి సినిమా విడుదల చేయాలన్నది టీమ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలా సినిమా విడుదల తేదీపై స్పష్టత వచ్చినప్పటికీ, ఇప్పుడు కొత్తగా సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ పనితీరుపై చర్చ మొదలైంది. పెద్ది చిత్రానికి ఆయన సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందనను దక్కించుకున్నాయి. అయితే పూర్తి స్థాయి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు ఇంకా పూర్తి కాలేదనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే చిత్రీకరించిన కొన్ని కీలక సన్నివేశాలకు కూడా ఇంకా బీజీఎం కంపోజ్ చేయాల్సి ఉందని టాక్ వినిపిస్తోంది. దీంతో నిర్ణయించిన సమయానికి రెహమాన్ తన పనిని పూర్తి చేస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా ఆయన ప్రాజెక్టుల విషయంలో ఆలస్యం జరిగిన సందర్భాలు ఉండటంతో, అభిమానుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. ఒకవేళ మ్యూజిక్ పనులు సమయానికి పూర్తికాకపోతే, సినిమా విడుదలపై మళ్లీ ప్రభావం పడే అవకాశం ఉ ంది. అవసరమైతే విడుదలను వాయిదా వేయాల్సి రావొచ్చని అంటున్నారు.



# అలా మాట్లాడితే జాన్వీకి కోపం వస్తుందట..!

బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా దేశంలోని అన్ని భాషల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసి, అభిమాన హీరోయిన్‌గా నిలిచిన అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ ఎంట్రీ ఇచ్చింది. శ్రీదేవికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరూ హీరోయిన్స్‌గానే ఇండస్ట్రీలో ఉన్నారు. అయినా కూడా అంతా జాన్వీ కపూర్ గురించి మాట్లాడుకుంటారు. అందుకు కారణం ఆమె అందం, ఆమె సోషల్ మీడియా పోస్టులు అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయిన జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తుంది. దాంతో హీరోయిన్‌గా ఆఫర్లను దక్కించుకుంటూ ఉంటుంది. జాన్వీ కపూర్ గురించి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలో ఎక్కువగా ఉంటుంది అనే విమర్శ ఉంది. అయినా పట్టించుకోకుండా జాన్వీ కపూర్ తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది.ఫోటో షూట్స్ తో జాన్వీ కపూర్ వైరల్...జాన్వీ కపూర్ ఫోటోలు రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తన ఫోటో షూట్ ఫోటోలను జాన్వీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం లేదంటే, ఏదైనా కార్యక్రమంకు వెళ్లిన సమయంలో మీడియా ఫోటోగ్రాఫర్లకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. జాన్వీ కపూర్ ఎక్కువగా పాపరాజీల దృష్టిని ఆకర్షించే విధంగా ఔట్ ఫిట్‌ను ధరిస్తుంది అనే టాక్ కూడా ఉంది. గతంలో పలు సార్లు పాపరాజీల గురించి పాజిటివ్‌గా మాట్లాడిన జాన్వీ కపూర్ తాజాగా ఒక చిట్ చాట్ సందర్భంగా వారు అప్పుడప్పుడు చేసే వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసింది. సందర్భానుసారంగా తాను ధరించిన డ్రెస్‌ను పాపరాజీలు ఇష్టానుసారంగా ఫోటోలు తీసుకుని, అందంగా లేదు అంటూ కామెంట్ చేయడంపై ఆమె తాజా చిట్ చాట్‌లో స్పందించింది.పాపరాజీలపై జాన్వీ కపూర్ కామెంట్స్...తన ఫోటోలను కొన్ని యాంగిల్స్‌లో చూసి పాపరాజీలు, నెటిజన్స్ 'ఈమె హాట్‌గా లేదు, అందంగా లేదు' అంటూ కామెంట్ చేయడం వంటివి చేస్తే కోపం వస్తుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తన గురించి ఇతరులు మాట్లాడుకోవడం పర్వాలేదు కానీ, తన గురించి పదే పదే నెగిటివ్‌గా మాట్లాడుకోవడం కోపం తెప్పిస్తుందని జాన్వీ కపూర్ అంది. తాను ఎన్నో ఫోటో షూట్స్‌లో హాట్‌గా అందంగా కనిపించాను. కొన్ని ఫోటోలను యాంగిల్ లేకుండా తీసి, ఇష్టానుసారంగా పోస్ట్ చేసిన పాపరాజీల ఫోటోలను చూసి కొందరు హాట్‌గా లేదని వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు అన్నట్లుగా జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. కంఫర్ట్ లేకుండా రకరకాల యాంగిల్స్ నుంచి ఫోటోలు తీయడం అనేది ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆ ఫోటోలను వారు హాట్‌గా లేదని కామెంట్ పెట్టి పోస్ట్ చేయడంను జాన్వీ కపూర్ తప్పుబట్టింది.రామ్ చరణ్, బుచ్చిబాబు పెద్ది సినిమాలో...జాన్వీ కపూర్ గత ఏడాది మూడు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ మూడు సినిమాలు సైతం తీవ్రంగా నిరాశ పరిచాయి. గత ఏడాది జాన్వీ కపూర్‌కి శృంగార తారగా మరింత గుర్తింపు దక్కింది. కానీ ఎప్పటిలాగే హిట్ మాత్రం దక్కలేదు. కానీ జాన్వీ కపూర్ ఈ ఏడాది పై చాలా ఆశలు పెట్టుకుంది. ఒకటి రెండు బాలీవుడ్ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. మరో వైపు రామ్ చరణ్ తో నటించిన పెద్ది సినిమా విడుదలకు ముస్తాబు అవుతుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉండబోతున్నట్లుగా ఇప్పటి వరకు విడుదలైన పాటలను బట్టి అర్థం అవుతుంది



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**